'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 87 | గురువారం | 12.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 87 | Thursday | 12.11.2026 | Pages: 8 | Rate: 2

పదో తరగతితో చదువుకు స్వస్తి వద్దు!



12వ తరగతి వరకు కొత్త విద్యా విధానం
విద్యార్థుల భవిష్యత్తే సంస్కరణల లక్ష్యం

తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విద్యార్థుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు విద్యా వ్యవస్థను ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. బుధవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలో విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో వచ్చే ఏడాది నుంచి 12వ తరగతి వరకు కొత్త విద్యా విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ, 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విధానం అమల్లోకి తీసుకురావాలని సూచించారు. పదో తరగతి తర్వాత సగటున 40 శాతం మంది విద్యార్థులు చదువు మానేస్తున్నారని, వీరిలో బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పిల్లలే అధికంగా ఉంటున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)

తమ్మిడి కుంటకు కొత్త కళ

» నాగార్జున నిజజీవిత హీరో!
» చెరువుల పునరుజ్జీవమే లక్ష్యం
» మూసీ ప్రక్షాళనకు సీఎం పిలుపు

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో పునరుద్ధరించిన తమ్మిడి కుంట చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు సినీ నటుడు అక్కినేని నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొంతమందికి ఇబ్బందులు ఎదురైనా, భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో తమ్మిడి కుంటను అభివృద్ధి చేశామని తెలిపారు. ఒకప్పుడు 14 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువును 30 ఎకరాలకు విస్తరించామని వెల్లడించారు. (వివరాలు 2లో..)



మైనారిటీలు, దళితుల ఓట్ల తొలగింపునకే సర్



ఏఐతో బ్లూకాలర్ ఉద్యోగాలకు ప్రమాదం తక్కువ
కేంద్రం తీరుతో ఓటు హక్కుకు ముప్పు: సీఎం

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మైనారిటీలు, దళితులు, పేదల ఓటు హక్కులను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని బంజారాభవన్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. (వివరాలు 2లో..)



ఆంధ్రకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు!

పక్క రాష్ట్రాలకు నీటి కేటాయింపులు
ప్రాజెక్టులు ఎండబెట్టి రైతులకు అన్యాయం
తెలంగాణలో కరువు ఎందుకు?: కేటీఆర్

తెలంగాణలో కరువు పరిస్థితులకు ప్రకృతి కంటే ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నిర్మల్‌లో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు కరువు బృందాలు వెళ్తున్నాయి.. కానీ తెలంగాణలో కరువు బీజేపీకి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష!

రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ విస్మరించింది
హస్తాన్ని ఓడించి, కారును గెలిపించండి: కేటీఆర్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. నిర్మల్‌లో నిర్వహించిన రైతు గర్జన సభలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను నీరుగార్చారని, యూరియా కొరత, ధాన్యం కొనుగోళ్ల సమస్యలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి మాట తప్పారని, విద్యుత్ కోతలతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని విమర్శించారు.



ఒక్కటైన అనిరుధ్-కావ్య మరన్ జంట!

3లో..

- గ్రీస్‌లో అంగరంగ వైభవంగా వివాహం

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్య మరన్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. నవంబర్ 11న గ్రీస్‌లో అత్యంత వైభవంగా, సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో వీరి వివాహ వేడుక జరిగినట్లు కథనాలు వెల్లడించాయి. తమ పెళ్లికి సంబంధించిన తొలి ఫొటోలను అనిరుధ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "నా జీవితంలో ఒక్కసారే వచ్చే అద్భుత క్షణం.. జీవితాంతం గుర్తుండిపోయే రోజు 11.11" అంటూ భావోద్వేగ సందేశం జతచేశారు. పెళ్లి వేడుకలో అనిరుధ్ ఐవరీ రంగు కుర్తా, వెస్టీ, ప్రత్యేక ఎంబ్రాయిడరీతో రూపొందించిన జాకెట్ ధరించారు. కావ్య మరన్ బ్లష్ పింక్ రంగు లెహంగాలో మెరిశారు. ప్రత్యేక నగలు, ఆకర్షణీయమైన అలంకరణతో వధూవరులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. నవంబర్ 10, 11 తేదీల్లో గ్రీస్‌లో జరిగిన ఈ వేడుకలకు సూపర్‌స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సహా పలువురు ప్రముఖులు హాజరైనట్లు సమాచారం. వీరి ప్రయాణానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

అనిరుధ్ పెళ్లిలో రజనీ.. స్టాలిన్!

- గ్రీస్ వేడుకలో ప్రముఖుల సందడి

తమిళ నిర్మాత ఏవీ సురేష్ ఈ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. తమిళనాడుకు చెందిన దయానిధి మారన్ తన కుమార్తెతో కలిసి సెల్ఫీ దిగిన ఈ ఫొటోలో పలువురు ప్రముఖులు కనిపించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, సూపర్‌స్టార్ రజనీకాంత్, ఆయన భార్య లతా రజనీకాంత్ ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. (వివరాలు 3లో..)

దావోస్ తరహాలో భారత్ సమ్మిట్-2

- ప్రపంచ ప్రజాస్వామ్య వేదిక హైదరాబాద్ • 70 దేశాలు.. వెయ్యి మందికి పైగా ప్రతినిధులు

ప్రపంచ రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలపై చర్చలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ వేదికగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం భారత్ సమ్మిట్-2026 నిర్వహిస్తోంది. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో భారత్ సమ్మిట్-2 జరగనుంది. 70కి పైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, విధాన నిర్ణేతలు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొననున్నారు. (వివరాలు 3లో..)





భారత్ సమ్మిట్ ముసుగులో కుట్రలు?

బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు విమర్శలు

హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్' దేశానికి పెట్టుబడులు తీసుకొచ్చే వేదిక కాదని, దేశంలో అరాచకం సృష్టించేందుకు జరుగుతున్న 'యాంటీ భారత్' ప్రయత్నమని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆరోపించారు. జార్జ్ సోరోస్ వంటి దేశ వ్యతిరేక శక్తుల మద్దతుతో రాహుల్ గాంధీని ప్రచారం చేసేందుకే ఈ సదస్సును ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇలాంటి శక్తులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మద్దతు పలుకుతోందని మండిపడ్డారు. (వివరాలు 3లో..)



2లో..

భూ రీసర్వేపై కలెక్టర్లకు దిశానిర్దేశం

22ఎ భూముల సమస్యలపై ప్రత్యేక దృష్టి
రైతులకు పూర్తి అవగాహన: పొంగులేటి

తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.



స్పై వల.. ఏఐ విలవిల

గూఢచర్యంతో కూలిన గ్లోబల్ సామ్రాజ్యం
హనీ ట్రాప్‌లో చిక్కుకున్న ఏఐ దిగ్గజం
నిన్నటి వరకు ప్రపంచ మార్కెట్ అధిపతి
బలహీనతకు లోనవ్వడంతో అధోగతి

వివరాలు 7లో..

మూడు దశాబ్దాల కష్టం.. అద్భుతమైన ఆవిష్కరణలు.. లక్షల కోట్ల విలువైన సాంకేతిక సామ్రాజ్యం! ప్రపంచ ఏఐ విప్లవానికి దిశానిర్దేశం చేసిన ఎన్‌విడియా అధినేత జెన్సన్ హువాంగ్.. ఇప్పుడు ఊహించని వివాదాల సుడిగుండంలో చిక్కుకున్నారు. గేమింగ్ చిప్‌లతో మొదలైన ఆయన ప్రస్థానం ప్రపంచ దేశాల సాంకేతిక భవిష్యత్తును శాసించే స్థాయికి చేరితే.. ఇప్పుడు అదే సామ్రాజ్యాన్ని వ్యక్తిగత సంబంధాలు, చైనా గూఢచర్య అనుమానాలు, అమెరికా జాతీయ భద్రతా ప్రశ్నలు చుట్టుముట్టాయి. ఆలిస్ హువాంగ్‌తో సన్నిహిత సంబంధాలపై అంతర్జాతీయంగా చర్చ.. భార్యకు నమ్మకద్రోహం చేశానంటూ ఉద్యోగులకు హువాంగ్ క్షమాపణలు.. ఆయనతో సంబంధాలున్న వ్యాపార నెట్‌వర్క్ ద్వారా 7.5 బిలియన్ డాలర్ల విలువైన చిప్‌లు చైనాకు చేరాయన్న సంచలన ఆరోపణలు! రంగంలోకి దిగిన అమెరికా మాజీ ఫెడరల్ ప్రాసిక్యూటర్ జూన్ కిమ్.. ఎన్‌విడియా బోర్డు దర్యాప్తు.. పెట్టుబడిదారుల ఆందోళనతో స్టాక్ మార్కెట్‌లో భారీ కుదుపులు! ఒకవైపు వ్యక్తిగత బంధాలపై ప్రశ్నలు.. మరోవైపు ప్రపంచ సాంకేతిక ఆధిపత్య పోరులో కీలకమైన చిప్‌ల రహస్యాలపై అనుమానాలు! అసలు ఆలిస్ హువాంగ్ ఎవరు? ఈ పరిచయం వెనుక వ్యాపార ప్రయోజనాలున్నాయా? చైనా నిఘా వ్యవస్థకు ఏమైనా సంబంధాలున్నాయా? హువాంగ్‌కు చిప్‌ల అక్రమ సరఫరా గురించి ముందే తెలుసా? మూడు దశాబ్దాల కష్టంతో నిర్మించిన ఏఐ సామ్రాజ్యానికి ఈ వివాదం ఎలాంటి ముప్పుగా మారనుంది? వ్యక్తిగత వివాదంగా మొదలైన వ్యవహారం అంతర్జాతీయ సంక్షోభంగా మారడం వెనుక అసలు కథేంటి? ప్రపంచాన్ని శాసించిన టెక్ దిగ్గజం.. ఇప్పుడు ఎవరి ఉచ్చులో చిక్కుకున్నారు?



మఠంలో ముఠాలు..

దేవాదాయశాఖ చోద్యం!

6లో

హైకోర్టు తప్ప ఎత్తిచూపే వరకు నిద్రపోయిందా?
శిష్యులకు నోటీసులేవి.. అధికారులకు బాధ్యతలేవి!
నియామకంలో లోపాలు.. నిబంధనలకు తూట్లు..!

ఒక ఆధ్యాత్మిక పీఠం.. వారసత్వం కోసం కుటుంబ పోరు.. తెరవెనుక వివాదాలు.. వీటన్నింటినీ చక్కదిద్ది ధర్మాన్ని కాపాడాల్సిన దేవాదాయశాఖే వివాదాల కేంద్రంగా మారింది! తరతరాల గురుశిష్య సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి ఎంపికలో అధికారుల నిర్లక్ష్యం ఇప్పుడు హైకోర్టు ముందే బట్టబయలైంది. శిష్యులకు నోటీసులేవు.. ఇతర మఠాల పీఠాధిపతులకు ఆహ్వానాలేవు.. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత లేదు.. ఆధ్యాత్మిక అర్హతల పరిశీలనకు తగిన ప్రాధాన్యం లేదు! చట్టంలో స్పష్టమైన నిబంధనలు ఉన్నా వాటిని అమలు చేయాల్సిన అధికారులే పక్కనపెట్టడం వెనుక ఆంతర్యమేమిటి? ఒకే తరహా అర్జీలపై వచ్చిన ఆరోపణల వెనుక అసలు కథేంటి? పెద్ద కుమారుడనే కారణంతో పీఠాధిపత్యం దక్కుతుందా? లేక ఆధ్యాత్మిక అర్హతలే అసలైన ప్రమాణమా? చివరకు జనవరి 13న జారీ చేసిన తాత్కాలిక నియామక ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసి, మూడు నెలల్లో చట్టబద్ధమైన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. అయినా అధికారుల బాధ్యతపై సమాధానం ఎక్కడ? మఠాన్ని కాపాడాల్సిన శాఖే వివాదాలకు వేదికైతే భక్తుల విశ్వాసానికి దిక్కెవరు? హైకోర్టు తప్పులు ఎత్తిచూపింది.. ఇకనైనా దేవాదాయశాఖ కళ్లు తెరుస్తుందా?

హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు షాక్!

సమన్లను పట్టించుకోకపోవడంపై ఆగ్రహం

నవంబర్ 17న హాజరుపరచాలని డీజీపీకి ఆదేశం
హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోర్టు విచారణకు హాజరుకాకపోవడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బుధవారం జరిగిన విచారణకు సమన్లు జారీ చేసినప్పటికీ రంగనాథ్ హాజరుకాకపోవడాన్ని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో ఆయనను నవంబర్ 17న కోర్టు ముందు హాజరుపరచాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ రంగనాథ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. విచారణకు రావాల్సిన అధికారుల గైర్హాజరుపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. (వివరాలు 2లో..)





సోనియా గాంధీ జీవితంపై తెలుగు సినిమా!

ఆత్మకథ ఆధారంగా తెరకెక్కించే యోచన

నిర్మాణానికి జగ్గారెడ్డి ₹ 2 కోట్ల విరాళం ప్రకటన
కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జీవిత ప్రస్థానాన్ని తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి కీలక నిర్ణయం ప్రకటించారు. (వివరాలు 3లో..)



భారత్‌లో క్వాల్‌కామ్‌లో ఉద్యోగులపై వేటు

బెంగళూరు, హైదరాబాద్‌లో ఆందోళనలు
వెయ్యికి మందికి ముప్పు, అంతటా ఇదే తంతు

ప్రముఖ అమెరికా చిప్ తయారీ సంస్థ క్వాల్‌కామ్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల తొలగింపుల ప్రక్రియ కలకలం రేపుతోంది. ఇందులో భాగంగా భారత్‌లో వెయ్యికి పైగా ఉద్యోగాలు ప్రమాదంలో పడినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. (వివరాలు 3లో..)



కశ్మీర్‌లో ఉగ్ర కాల్పులు

ముగ్గురు జవాన్లకు గాయాలు!
కుల్గాంలో సీఆర్‌పీఎఫ్‌పై ఎటాక్
చెక్‌పోస్ట్‌పై ఉగ్రవాదుల మెరుపు దాడి

జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో బుధవారం మధ్యాహ్నం సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బుల్లెట్ గాయాలతో తీవ్రంగా గాయపడ్డారు. (వివరాలు 3లో..)



పదో తరగతితో
చదువుకు స్వస్తి వద్దు!

- 12వ తరగతి వరకు కొత్త విద్యా విధానం
- విద్యార్థుల భవిష్యత్తే సంస్కరణల లక్ష్యం

తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విద్యార్థుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు విద్యా వ్యవస్థను ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో వచ్చే ఏడాది నుంచి 12వ తరగతి వరకు కొత్త విద్యా విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ, 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విధానం అమల్లోకి తీసుకురావాలని సూచించారు. పదో తరగతి తర్వాత సగటున 40 శాతం మంది విద్యార్థులు చదువు మానేస్తున్నారని, వీరిలో బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పిల్లలే అధికంగా ఉంటున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. 12వ తరగతి వరకు చదువు కొనసాగించే విధానం ద్వారా డ్రాపౌట్లను తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. కేంద్రీయ, నవోదయ, కస్తూర్బా విద్యాలయాల్లో డ్రాపౌట్లు తక్కువగా ఉన్నాయని, దేశంలోని 18 రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ విధానం అమల్లో ఉందని గుర్తుచేశారు. జూనియర్ కళాశాలల లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది ఉద్యోగ, పదవీ విరమణ ప్రయోజనాలకు ఎలాంటి ఇబ్బంది కలగనివ్వబోమని భరోసా ఇచ్చారు.

పాఠశాలలకు పూర్తిస్థాయి మౌలిక వసతులు

సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఇకపై అద్దె భవనాల్లో కొనసాగకూడదని సీఎం స్పష్టం చేశారు. శాశ్వత భవనాల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని, అవసరమైన నిధులు విడుదల చేస్తామని తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్లలో మరుగుదొడ్లు, నిరంతర నీటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ల్యాండ్‌స్కేపింగ్, ఇంటీరియర్, డిజిటల్ పరికరాలు, క్రీడా సామగ్రి, వంటగది పరికరాల కొనుగోలుకు నాణ్యమైన సంస్థలను ఎంపిక చేయాలని, నిర్మాణాల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న పాఠశాలల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, ఇంకా నిర్మించాల్సిన చోట పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.


ఉద్యోగాలకు దారిచూపే విద్య.. నియామకాలకు వేగం

ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఏటీసీ) మార్చిన తర్వాత విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని, శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు లభించాయని సీఎం తెలిపారు. ఇదే తరహాలో పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణకు అవసరమైన నిధుల విడుదల వేగవంతం చేయాలని ఆదేశించారు. శాఖాపరమైన సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. యూనివర్సిటీల్లో అసిస్టెంట్, అసోసియేట్, ఇతర ప్రొఫెసర్ల నియామకాలను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. నియామకాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఉన్నత విద్యామండలి ఛైర్మన్, వైస్ ఛాన్సలర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, వివిధ విద్యాశాఖల ఉన్నతాధికారులు, యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు పాల్గొన్నారు.

తమ్మిడి కుంటకు కొత్త కళ

- నాగార్జున నిజజీవిత హీరో!
- చెరువుల పునరుజ్జీవమే లక్ష్యం
- మూసీ ప్రక్షాళనకు సీఎం పిలుపు





హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో పునరుద్ధరించిన తమ్మిడి కుంట చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు సినీ నటుడు అక్కినేని నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొంతమందికి ఇబ్బందులు ఎదురైనా, భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో తమ్మిడి కుంటను అభివృద్ధి చేశామని తెలిపారు. ఒకప్పుడు 14 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువును 30 ఎకరాలకు విస్తరించామని వెల్లడించారు. ఈ అభివృద్ధి కోసం అక్కినేని నాగార్జున మంచి మనసుతో ముందుకొచ్చి రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అందించారని ప్రశంసించారు. సినిమాల్లోనే కాదు.. నిజజీవితంలోనూ నాగార్జున నిజమైన హీరోగా నిలిచారని కొనియాడారు. నిన్నటి వరకు శిల్పారామం గురించి మాట్లాడుకున్న హైదరాబాద్ ప్రజలు.. ఇకపై తమ్మిడి కుంట గురించి మాట్లాడుకుంటారని, వర్క్ ఫ్రమ్ హోమ్‌కు బదులుగా వర్క్ ఫ్రమ్ తమ్మిడి కుంట అనే స్థాయిలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.

చెరువుల ఆక్రమణలతో నగరానికి ముప్పు

హైదరాబాద్ ఒకప్పుడు రాక్స్ అండ్ లేక్స్ సిటీగా గుర్తింపు పొందిందని, నగరంలో 1,372 చెరువులు ఉండగా వివిధ కారణాలతో సగానికి పైగా కనుమరుగయ్యాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల ఆక్రమణల కారణంగా వర్షాలు కురిసినప్పుడు రహదారులు నీటమునుగుతున్నాయని, కాలనీలు జలమయమవుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితిని ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు. గతంలో మూసీ వరదల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు నిజాం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారని గుర్తుచేశారు. వికారాబాద్ ప్రాంతంలో ప్రారంభమయ్యే ముచుకుందా నది, మూసా, ఈసా నదుల సంగమంతో మూసీగా మారుతుందని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు నదీ నాగరికత ఆధారంగా అభివృద్ధి చెందాయని, వందేళ్ల క్రితమే మూసీ పరివాహక ప్రాంత ప్రాధాన్యతను నిజాం గుర్తించారని తెలిపారు. అయితే నేడు మూసీ తీవ్ర కాలుష్యానికి గురైందని, దాని ప్రభావంతో నల్లగొండ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

మూసీకి పునరుజ్జీవం.. రాజకీయాలకు అతీతంగా సహకారం

ప్రకృతి పరిరక్షణతో పాటు హైదరాబాద్‌ను విశ్వనగరంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే చెరువుల పునరుద్ధరణ చేపట్టామని, సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని, చెరువులను ఆక్రమణల చెర నుంచి విడిపించాల్సిందేనని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవనంలో ఎవరికీ నష్టం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. త్వరలోనే తొలి దశ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. మూసీ సుందరీకరణ మాత్రమే తమ లక్ష్యం కాదని, నదికి సంపూర్ణ పునరుజ్జీవం కల్పించడమే ప్రధాన ఉద్దేశమని చెప్పారు. నగర ప్రజల జీవనంతో మూసీ నది విడదీయలేని సంబంధం కలిగి ఉందన్నారు. నదుల పేర్లను ఆడబిడ్డలకు పెట్టుకునే సంస్కృతి మనదని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉండాలని, అభివృద్ధి విషయంలో అన్ని పార్టీలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. తమ్మిడి కుంట వద్ద ప్రజలకు భద్రత కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఇక్కడ లేక్ ఎకానమీని అభివృద్ధి చేయాలని, చెరువు ఆవరణలో జమ్మి చెట్టు నాటాలని రంగనాథ్‌కు సూచించారు. భవిష్యత్తులో చెరువులు దసరా వేడుకలకు వేదికలుగా మారాలని, మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

మైనారిటీలు, దళితుల ఓట్ల తొలగింపునకే సర్

- ఏఐతో బ్లూకాలర్ ఉద్యోగాలకు ప్రమాదం తక్కువ
- కేంద్రం తీరుతో ఓటు హక్కుకు ముప్పు: సీఎం



ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మైనారిటీలు, దళితులు, పేదల ఓటు హక్కులను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని బంజారాభవన్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో మైనారిటీలకు అమలవుతున్న నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ డిమాండ్ చేయడాన్ని ప్రశ్నించారు. అదే డిమాండ్‌ను గుజరాత్‌లో ఎందుకు వినిపించడం లేదని నిలదీశారు. మైనారిటీ విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లను కూడా బీజేపీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వాన్ని అధికారంలోనుంచి దించడం కాంగ్రెస్ రాజకీయ లక్ష్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఏఐతో వైట్‌కాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండొచ్చని, బ్లూకాలర్ ఉద్యోగాలకు ఆ ప్రమాదం తక్కువని అభిప్రాయపడ్డారు.

బీఆర్ఎస్ ఆరోపణలపై ఎదురుదాడి

కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ముఖ్యమంత్రి ఖండించారు. గతంలో బీఆర్ఎస్ నాయకత్వం ప్రధాని మోదీతో కొనసాగించిన రాజకీయ సంబంధాల గురించి ప్రశ్నించారు. కాంగ్రెస్ వైఖరిపై విమర్శలు చేసే ముందు బీఆర్ఎస్ నేతలు తమ గత రాజకీయ వ్యవహారాలను గుర్తు చేసుకోవాలని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా దేశ విద్యారంగ అభివృద్ధిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాత్రను రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆయన కాలంలో ఏర్పాటైన విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు దేశ విద్యావ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని పేర్కొన్నారు. విద్యా వికాశాల విస్తరణలో ఆజాద్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.



భూ రీసర్వేపై కలెక్టర్లకు
దిశానిర్దేశం

- 22ఎ భూముల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- సందేహాలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం
- రైతులకు పూర్తి అవగాహన: మంత్రి పొంగులేటి

తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రీసర్వేను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. సర్వే పూర్తయిన తర్వాత అభ్యంతరాలు తెలియజేసే విధానంపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. నోటీసులు జారీ చేసిన అనంతరం ప్రతి 15 రోజులకు గ్రామాల్లో చాటింపు నిర్వహించాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూమి విస్తీర్ణం, రీసర్వేలో గుర్తించిన విస్తీర్ణాన్ని భూ యజమానులకు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీసర్వే, గృహ నిర్మాణాల పురోగతిని సమీక్షించారు.

141 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని 141 రెవెన్యూ గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా భూ రీసర్వే చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలు, రెండు రోవర్లను అందుబాటులో ఉంచామని, రాష్ట్రవ్యాప్తంగా 708 రోవర్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మరో వారం రోజుల్లో అదనంగా 400 రోవర్లను ఏర్పాటు చేస్తామన్నారు. క్షేత్రస్థాయి అధికారుల సూచనల మేరకు రీసర్వే ఎస్ఓపీలో అవసరమైన మార్పులు చేసి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని చెప్పారు. తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో అధికారులతో సుదీర్ఘ సమీక్షలు నిర్వహించి భూ విస్తీర్ణంలో తేడాలు, ప్రభుత్వ భూములు, వివాదాల పరిష్కారంపై చర్చించినట్లు వెల్లడించారు. రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దులను ఇరు శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి నిర్ధారించాలని సూచించారు. రీసర్వేలో మంచి పనితీరు కనబరిచిన నల్గొండ, ఖమ్మం కలెక్టర్లను అభినందించగా, నిజామాబాద్ జిల్లా పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు.. 22ఎ సమస్యలపై ప్రత్యేక దృష్టి

భూ రీసర్వేతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి అర్హులైన పేదలకు త్వరగా లబ్ధి చేకూర్చాలన్నారు. వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హనుమకొండ ఐదు కార్పొరేషన్లలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. 2బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణం ఏ దశలో ఉన్నా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని, ఇళ్లను కేటాయించాలని ఆదేశించారు. అలాగే 22ఎ భూముల సమస్యలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని స్పష్టం చేశారు. రీసర్వే, గృహ నిర్మాణాలు, భూ వివాదాల పరిష్కారంలో వేగం, పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు!

- పక్క రాష్ట్రాలకు నీటి కేటాయింపులు
- ప్రాజెక్టులు ఎండబెట్టి రైతులకు అన్యాయం
- తెలంగాణలో కరువు ఎందుకు?: కేటీఆర్



తెలంగాణలో కరువు పరిస్థితులకు ప్రకృతి కంటే ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నిర్మల్‌లో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు కరువు బృందాలు వెళ్తున్నాయి.. కానీ తెలంగాణలో కరువు బీజేపీకి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ఆంధ్రకు నీళ్లు అందుతుంటే తెలంగాణ రైతులకు ఎక్కిళ్లు ఎందుకని నిలదీశారు. 90 శాతం పూర్తయిన పాలమూరు ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టిందని, కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్షతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణకు దక్కాల్సిన 1,000 టీఎంసీల నీటిని కిందకు వదిలేస్తున్నారని మండిపడ్డారు. పట్టిసీమ ద్వారా చంద్రబాబు నీటిని తరలిస్తుంటే, కన్నెపల్లి వద్ద పంపులు ఎందుకు ప్రారంభించలేదని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. సదర్‌మాట్ బ్యారేజీ, శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌ను సద్వినియోగం చేసుకుంటే నిర్మల్ జిల్లాలో కరువు వచ్చేది కాదన్నారు.

రైతులకు తక్షణమే పరిహారం ఇవ్వాలి

రైతులకు నీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. నాలుగు విడతల రైతుబంధు వెంటనే విడుదల చేయాలని, పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని, పెండింగ్ రుణమాఫీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కరువు కారణంగా ఉపాధి కోల్పోయిన ప్రతి వ్యవసాయ కూలీకి నెలకు రూ.1,000 చొప్పున 36 నెలలకు రూ.36 వేలు పరిహారం అందించాలని కోరారు. రైతులకు ధైర్యం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. తెలంగాణకు నిధులు తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు విఫలమయ్యారని విమర్శించారు. ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ విక్రయం, నిర్మల్‌కు నవోదయ విద్యాలయం మంజూరు కాకపోవడంపై బీజేపీ నేతలను నిలదీశారు. తెలంగాణలో ఓట్లు కావాలి కానీ నిధులు ఇవ్వడానికి మనసు లేదా? అంటూ ప్రధాని మోదీని ప్రశ్నించారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయాలని సవాల్ విసిరారు.

కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష!

- రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ విస్మరించింది
- హస్తాన్ని ఓడించి, కారును గెలిపించండి: కేటీఆర్



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. నిర్మల్‌లో నిర్వహించిన రైతు గర్జన సభలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను నీరుగార్చారని, యూరియా కొరత, ధాన్యం కొనుగోళ్ల సమస్యలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి మాట తప్పారని, విద్యుత్ కోతలతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, దళితులు, మైనారిటీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. మూడేళ్లలో రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసినా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. విద్యా భరోసా కార్డు హామీ అమలు కాలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లకు చేరాయని పేర్కొన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ, పెండింగ్ డీఏలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని వ్యాఖ్య

తెలంగాణ ఉద్యమానికి నిర్మల్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం సాధించుకున్నామని, వ్యవసాయ రంగానికి కొత్త దిశ లభించిందని చెప్పారు. మిషన్ కాకతీయతో 46 వేల చెరువులకు పునర్జీవం, రైతుబంధుతో 11 విడతల పెట్టుబడి సాయం, రైతుబీమాతో కుటుంబాలకు భరోసా కల్పించారని కొనియాడారు. నిరంతర విద్యుత్, మిషన్ భగీరథ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గిరిజనులకు పోడు పట్టాలు, రిజర్వేషన్ల పెంపు వంటి కార్యక్రమాలను వివరించారు. బీడీ కార్మికులకు పెన్షన్లు అందించిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని, హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములను విక్రయిస్తూ ఆదాయం సమకూర్చుకుంటోందని ఆరోపించారు. కేటీఆర్ గద్దం గురించి ఆలోచించే ముఖ్యమంత్రికి రైతుల సమస్యలు పట్టడం లేదంటూ విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే కేసీఆర్ నాయకత్వం అవసరమని పేర్కొంటూ, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



హైడ్రా కమిషనర్‌కు
హైకోర్టు షాక్!

- సమన్లను పట్టించుకోక పోవడంపై ఆగ్రహం
- నవంబర్ 17న హాజరుపరచాలని డీజీపీకి ఆదేశం



హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోర్టు విచారణకు హాజరుకాకపోవడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బుధవారం జరిగిన విచారణకు సమన్లు జారీ చేసినప్పటికీ రంగనాథ్ హాజరు కాకపోవడాన్ని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో ఆయనను నవంబర్ 17న కోర్టు ముందు హాజరుపరచాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ రంగనాథ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. విచారణకు రావాల్సిన అధికారుల గైర్హాజరుపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది.

శంషాబాద్ తహసీల్దార్‌పైనా ఆదేశాలు

ఈ కేసులో శంషాబాద్ మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ)ను కూడా తదుపరి విచారణ రోజున కోర్టు ముందు హాజరుపరచాలని హైకోర్టు ఆదేశించింది. ఆ అధికారిని హాజరుపరిచే బాధ్యతను సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు అప్పగించింది. రంగనాథ్‌తో పాటు తహసీల్దార్ కూడా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. అయితే న్యాయస్థానం వాటిని తిరస్కరించింది. కోర్టు ఆదేశాల అమలులో అధికారుల నిర్లక్ష్యంపై తీవ్రంగా స్పందించిన హైకోర్టు, ఇద్దరు అధికారుల హాజరును నిర్ధారించాలని స్పష్టం చేసింది. నవంబర్ 17న జరిగే విచారణపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.


సోనియా గాంధీ జీవితంపై

తెలుగు సినిమా!

ఆత్మకథ ఆధారంగా తెరకెక్కించే యోచన

నిర్మాణానికి జగ్గారెడ్డి ₹ 2 కోట్ల విరాళం ప్రకటన

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జీవిత ప్రస్థానాన్ని తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి కీలక నిర్ణయం ప్రకటించారు. సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆధారంగా ఆమె వ్యక్తిగత జీవితం, రాజకీయ ప్రయాణంపై తెలుగు సినిమా నిర్మించాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ ప్రతిపాదనను ప్రకటించారు. ఈ సినిమా నిర్మాణ బాధ్యతను నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో పార్టీ కోసం ఎలా ఖర్చు చేస్తారో, ఈ సినిమాను కూడా అలాంటి బాధ్యతగా భావించి ఆర్థికంగా సహకరించాలని కోరారు.



రూ.2 కోట్ల విరాళం ప్రకటించిన ఆంజనేయులు

జగ్గారెడ్డి ప్రతిపాదనకు స్పందించిన సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు సినిమా నిర్మాణానికి రూ.2 కోట్లు విరాళంగా అందిస్తానని ప్రకటించారు. సినిమా ప్రణాళికలు ఖరారైన తర్వాత షూటింగ్‌ను అధికారికంగా ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్‌లను ఆహ్వానిస్తామని జగ్గారెడ్డి తెలిపారు. సోనియా కుటుంబ జీవితం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశం వరకు, ఆమె జీవితంలో ఎదురైన విషాదాలు, చేసిన త్యాగాలు సినిమాలో ప్రధానంగా చూపిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవస్థలోని సంక్లిష్టతలను అర్థం చేసుకుని సోనియా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని వివరించారు.


యువతకు 2004 రాజకీయ చరిత్ర పరిచయం

2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధాని పదవిని సోనియా గాంధీ స్వీకరించకుండా తిరస్కరించడం దేశ రాజకీయ చరిత్రలో కీలక ఘట్టమని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆమె నిర్ణయంతోనే మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రి అయ్యారని గుర్తుచేశారు. ఈ పరిణామాలను నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపకల్పన వెనుక సోనియా గాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్ గాంధీల ఆలోచనలు ఉన్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు. సోనియా జీవితంలోని వ్యక్తిగత, రాజకీయ కోణాలను కలిపి తెరకెక్కించే ఈ సినిమా ద్వారా ఆమె ప్రయాణాన్ని కొత్త తరానికి పరిచయం చేయాలన్నది ఆయన ఉద్దేశంగా వెల్లడించారు.

ఒక్కటైన అనిరుధ్–కావ్య మరన్ జంట!


- **గ్రీస్‌లో అంగరంగ వైభవంగా వివాహం**

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్య మరన్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. నవంబర్ 11న గ్రీస్‌లో అత్యంత వైభవంగా, సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో వీరి వివాహ వేడుక జరిగినట్లు కథనాలు వెల్లడించాయి. తమ పెళ్లికి సంబంధించిన తొలి ఫొటోలను అనిరుధ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "నా జీవితంలో ఒక్కసారే వచ్చే అద్భుత క్షణం.. జీవితాంతం గుర్తుండిపోయే రోజు 11.11" అంటూ భావోద్వేగ సందేశం జతచేశారు. పెళ్లి వేడుకలో అనిరుధ్ ఐవరీ రంగు కుర్తా, వెష్టీ, ప్రత్యేక ఎంబ్రాయిడరీతో రూపొందించిన జాకెట్ ధరించారు. కావ్య మరన్ బ్లష్ పింక్ రంగు లెహంగాలో మెరిశారు. ప్రత్యేక నగలు, ఆకర్షణీయమైన అలంకరణతో వధూవరులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. నవంబర్ 10, 11 తేదీల్లో గ్రీస్‌లో జరిగిన ఈ వేడుకలకు సూపర్‌స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సహా పలువురు ప్రముఖులు హాజరైనట్లు సమాచారం. వీరి ప్రయాణానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.



నవంబర్ 21న చెన్నైలో భారీ రిసెప్షన్

గ్రీస్‌లో వివాహం అనంతరం నవంబర్ 21న చెన్నైలో భారీ రిసెప్షన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కావ్య తల్లిదండ్రులు కళానిధి మరన్, కావేరి మరన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వేడుకకు ఆహ్వానించడంతో రిసెప్షన్ తేదీకి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. సినీ రంగం నుంచి రజనీకాంత్, కమల్ హాసన్, ఏఆర్ రెహమాన్, ధనుష్, అజిత్, అల్లు అర్జున్ తదితర ప్రముఖులకు ఆహ్వానాలు అందినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. క్రికెట్ రంగం నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ తదితరులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. 'వై దిస్ కొలవెరి డి' పాటతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన అనిరుధ్, పలు భాషల్లో అగ్ర హీరోల చిత్రాలకు సంగీతం అందించారు. కావ్య మరన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవోగా, సన్ టీవీ నెట్‌వర్క్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరి వివాహంపై గత ఏడాది నుంచే ప్రచారం సాగగా, ఇప్పుడు ఆ ఊహాగానాలకు తెరపడింది.



అనిరుధ్ పెళ్లిలో రజనీ.. స్టాలిన్ సందడి!

- **గ్రీస్ వేదికలో ప్రముఖుల సందడి**

సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్య మరన్ వివాహ వేడుకకు సంబంధించిన మరో ఆసక్తికర ఫొటో బయటకు వచ్చింది. తమిళ నిర్మాత ఏవీ సురేష్ ఈ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. తమిళనాడుకు చెందిన దయానిధి మారన్ తన కుమార్తెతో కలిసి సెల్ఫీ దిగిన ఈ ఫొటోలో పలువురు ప్రముఖులు కనిపించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, సూపర్‌స్టార్ రజనీకాంత్, ఆయన భార్య లతా రజనీకాంత్ ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్టాలిన్, రజనీకాంత్ సంప్రదాయ వస్త్రధారణలో కనిపించడం ఫొటోకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. గ్రీస్‌లో నవంబర్ 11న జరిగిన ఈ స్టార్‌స్టడెడ్ వివాహ వేడుకకు సంబంధించిన చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

భారత్‌లో క్వాల్‌కామ్‌లో ఉద్యోగులపై వేటు

- **బెంగళూరు, హైదరాబాద్‌లో ఆందోళనలు**
- **వెయ్యికి మందికి ముప్పు... అంతటా ఇదే తంతు**

ప్రముఖ అమెరికా చిప్ తయారీ సంస్థ క్వాల్‌కామ్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల తొలగింపుల ప్రక్రియ కలకలం రేపుతోంది. ఇందులో భాగంగా భారత్‌లో వెయ్యికి పైగా ఉద్యోగాలు ప్రమాదంలో పడినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. అయితే దేశంలో ఎంతమందిని తొలగించబోతున్నారనే విషయాన్ని సంస్థ అధికారికంగా ప్రకటించలేదు. అక్టోబర్ 19న ఉద్యోగులకు పంపిన అంతర్గత మెమోలో సీఈవో క్రిస్టియానో అమోన్ ఈ చర్యను 'పనితీరు ఆధారిత ఉద్యోగుల తగ్గింపు'గా అభివర్ణించారు. వార్షిక ఉద్యోగుల సమీక్షల అనంతరం సంస్థ పనితీరును మెరుగుపరిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వ్యాపార ప్రాధాన్యతలు, సంస్థాగత అవసరాలు, ఉద్యోగుల నైపుణ్యాల ఆధారంగా తొలగింపులు ఉంటాయని పేర్కొన్నారు. నవంబర్‌లో బాధిత ఉద్యోగులకు సమాచారం అందిస్తామని తెలిపారు. ఈ వ్యవహారంపై క్వాల్‌కామ్‌ను వివరణ కోరినా స్పందన రాలేదు. పరిశ్రమ విశ్లేషకుడు పరీక్ జైన్ అంచనా ప్రకారం భారత్‌లో సుమారు 1,000 మంది ఉద్యోగులు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఈ తొలగింపులు కేవలం పనితీరు ఆధారంగా కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించి ఖర్చులను నియంత్రించే వ్యూహంలో భాగమని ఆయన అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్, బెంగళూరులో ఉద్యోగుల్లో ఆందోళన

క్వాల్‌కామ్ నవంబర్ 4న అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు సమర్పించిన వార్షిక నివేదిక ప్రకారం, సెప్టెంబర్ 27 నాటికి ప్రపంచవ్యాప్తంగా సంస్థలో సుమారు 57 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. 2023 కార్పొరేట్ బాధ్యత నివేదిక ప్రకారం మొత్తం ఉద్యోగుల్లో 36 శాతం మంది భారత్‌లోనే పనిచేస్తున్నారు. అంటే అప్పట్లో సుమారు 18,100 మంది భారత ఉద్యోగులు ఉన్నారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, నోయిడాలో సంస్థకు కీలక పరిశోధన, ఇంజినీరింగ్ కేంద్రాలున్నాయి. ఇటీవల ఉద్యోగుల తొలగింపులపై రెడ్డిట్‌లో వచ్చిన పోస్టుల్లో హైదరాబాద్, బెంగళూరులో ఉద్యోగులకు నోటీసులు అందినట్లు పేర్కొన్నారు. మంచి పనితీరు రేటింగ్ ఉన్నవారూ ప్రభావితమయ్యారని కొందరు చెబుతున్నప్పటికీ ఈ వివరాలు స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. మరోవైపు 2026 ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయం 3 శాతం తగ్గి 43.12 బిలియన్ డాలర్లకు చేరింది. నాలుగో త్రైమాసిక ఆదాయం 8 శాతం పడిపోయింది. నికర లాభం కూడా తగ్గడం సంస్థపై ఆర్థిక ఒత్తిడిని సూచిస్తోంది.



తొలగింపులపై కార్మిక చట్టాల ప్రశ్నలు

ఉద్యోగుల తొలగింపులకు సంబంధించి ప్రభుత్వ అనుమతులు తీసుకున్నారా అనే అంశంపై యూనియన్ ఆఫ్ ఐటీ అండ్ ఐటీఈఎస్ ఎంప్లాయీస్ (UNITE) అధ్యక్షుడు అలగునంబి వెల్మిన్ ప్రశ్నలు లేవనెత్తారు. తమిళనాడులో 100 మంది ఉద్యోగుల పరిమితికి సంబంధించిన పారిశ్రామిక వివాదాల చట్టం నిబంధనల ప్రకారం కొన్ని సంస్థల్లో తొలగింపులకు ముందస్తు ప్రభుత్వ అనుమతి అవసరమని పేర్కొన్నారు. అయితే 2025 నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చిన పారిశ్రామిక సంబంధాల కోడ్ ప్రకారం నిర్దిష్ట సంస్థల్లో ఈ పరిమితి 300కు పెరిగింది. తమిళనాడు ప్రభుత్వం తుది రాష్ట్ర నిబంధనలను ఇంకా ప్రకటించలేదని, ప్రస్తుతం ముసాయిదా నిబంధనలే ఉన్నాయని ఆయన వివరించారు. రాజీనామా చేయాలని ఒత్తిడి ఎదుర్కొంటున్న ఉద్యోగులు తొలగింపు ప్రక్రియ ప్రారంభమయ్యే ముందే కార్మిక శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. మొత్తంగా క్వాల్‌కామ్ భారత్‌లో తొలగింపుల సంఖ్యను అధికారికంగా ధ్రువీకరించకపోవడంతో ఉద్యోగుల్లో అనిశ్చితి కొనసాగుతోంది.

కశ్మీర్‌లో ఉగ్ర కాల్పులు

- **ముగ్గురు జవాన్లకు గాయాలు!**
- **కుల్గాంలో సీఆర్‌పీఎఫ్‌పై ఎటాక్**
- **చెక్‌పోస్ట్‌పై ఉగ్రవాదుల మెరుపు దాడి**

జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో బుధవారం మధ్యాహ్నం సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బుల్లెట్ గాయాలతో తీవ్రంగా గాయపడ్డారు. మధ్యాహ్నం సుమారు 2.15 గంటల సమయంలో చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న జవాన్లపై సమీపం నుంచి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాడికి పాల్పడిన వారు మోటార్‌సైకిల్‌పై వచ్చారా? ఇతర వాహనాన్ని ఉపయోగించారా? అనే కోణాల్లో భద్రతా సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి. దాడి జరిగిన ప్రాంతంతో పాటు పరిసరాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. గాయపడిన జవాన్లను సీఆర్‌పీఎఫ్ 46వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ రాకేశ్ దాస్ (అస్సాం), కానిస్టేబుల్ సంతోష్ చంద్రు (పశ్చిమ బెంగాల్), హెడ్ కానిస్టేబుల్ సోమవీర్ సింగ్ (మధ్యప్రదేశ్)గా గుర్తించారు. వీరిని తొలుత అనంత్‌నాగ్‌లోని ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రత్యేక చికిత్స కోసం శ్రీనగర్‌లోని బాదామీబాగ్ ఆర్మీ ఆసుపత్రికి హెలికాప్టర్‌లో తరలించారు. ఘటన అనంతరం దక్షిణ కశ్మీర్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.



ఉగ్రవాదులకు స్వేచ్ఛ లేదు.. ఎల్జీ హెచ్చరిక

ఈ దాడి జరిగిన రోజే జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కుల్గాం జిల్లాలో పర్యటించారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమంలో భాగంగా వేశో ఉత్సవాన్ని ప్రారంభించి స్థానికులు, అధికారులతో మాట్లాడారు. సాయంత్రం శ్రీనగర్ ఆసుపత్రికి వెళ్లి గాయపడిన జవాన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యగా అభివర్ణించిన ఆయన, బాధ్యులను గుర్తించి చట్టం ముందు నిలబెడతామని హెచ్చరించారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకునేందుకు భద్రతా బలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని స్పష్టం చేశారు.

అనంతరం శ్రీనగర్‌లోని లోక్‌భవన్‌లో ఉన్నతాధికారులతో సమావేశమై భద్రతా పరిస్థితిని సమీక్షించారు. కుల్గాంలో నిర్వహించిన వేశో ఉత్సవం జమ్మూకశ్మీర్ సాహిత్య, సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోందని, రిషి-సూఫీ సంప్రదాయాలు ఈ ప్రాంత ప్రత్యేకతను చాటుతున్నాయని అంతకు ముందు పేర్కొన్నారు.

దాడిని ఖండించిన బీజేపీ

సీఆర్‌పీఎఫ్ జవాన్లపై జరిగిన దాడిని బీజేపీ తీవ్రంగా ఖండించింది. జమ్మూకశ్మీర్‌లో శాంతి, భద్రతలకు విఘాతం కలిగించాలనే ఉగ్రవాదుల ప్రయత్నాలు ఎప్పటికీ విజయవంతం కావని పార్టీ అధికార ప్రతినిధి సాజిద్ యూసుఫ్ షా పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రశాంత సమాజంలో ఉగ్రవాదానికి, హింసకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. మరోవైపు దాడి వెనుక ఉన్న ఉగ్రవాదుల ఆచూకీ కోసం భద్రతా బలగాలు గాలింపు ముమ్మరం చేశాయి. దక్షిణ కశ్మీర్‌లో అదనపు నిఘా ఏర్పాటు చేసి అనుమానితుల కదలికలపై దృష్టి సారించాయి.

దావోస్ తరహాలో భారత్ సమ్మిట్–2

- **ప్రపంచ ప్రజాస్వామ్య హైదరాబాద్ వేదిక!**
- **70 దేశాలు.. వెయ్యి మందికి పైగా ప్రతినిధులు**

ప్రపంచ రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలపై చర్చలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ వేదికగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం భారత్ సమ్మిట్-2026 నిర్వహిస్తోంది. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో భారత్ సమ్మిట్-2 జరగనుంది. 70కి పైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, విధాన నిర్ణేతలు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొననున్నారు. దావోస్ తరహాలో ప్రపంచ విధాన చర్చలకు హైదరాబాద్ గుర్తింపు పొందాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నోవాటెల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న హింస, విద్వేష రాజకీయాలు, విభజన ధోరణుల నేపథ్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, అహింస, అలీన విధానం, మిశ్రమ ఆర్థిక విధానాలే సమ్మిట్ ప్రధాన అజెండా అని వెల్లడించారు. మహాత్మా గాంధీ అహింసా సిద్ధాంతం, జవహర్‌లాల్ నెహ్రూ అలీన విధానం నేటి ప్రపంచానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు అగ్రరాజ్యాల ప్రభావానికి లోనుకాకుండా తమ స్వతంత్ర అస్తిత్వాన్ని కాపాడుకోవాలని నెహ్రూ ఆశించారని గుర్తుచేశారు.

ప్రతిపక్షాలకు గౌరవం.. ఓటు హక్కుకు రక్షణ

ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతో పాటు ప్రతిపక్షం కూడా కీలకమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రతిపక్షాలను రాజకీయ ప్రత్యర్థులుగా చూడాలే తప్ప శత్రువులుగా పరిగణించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలను రాజకీయంగా అంతం చేయాలనే ధోరణులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులను భారత్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల కోసమే కాకుండా ఓటు హక్కు కోల్పోయే ప్రమాదంలో ఉన్న ప్రతి పౌరుడి తరఫున పోరాడుతున్నామని చెప్పారు. ప్రతి అర్హులైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం, ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, గురుదీప్ సింగ్ సప్పల్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ ముసుగులో కుట్రలు?

- **బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు విమర్శలు**



హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్' దేశానికి పెట్టుబడులు తీసుకొచ్చే వేదిక కాదని, దేశంలో అరాచకం సృష్టించేందుకు జరుగుతున్న 'యాంటీ భారత్' ప్రయత్నమని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆరోపించారు. జార్జ్ సోరోస్ వంటి దేశ వ్యతిరేక శక్తుల మద్దతుతో రాహుల్ గాంధీని ప్రచారం చేసేందుకే ఈ సదస్సును ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇలాంటి శక్తులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మద్దతు పలుకుతోందని మండిపడ్డారు. ఈ 'ప్రోగ్రెసివ్ అలయన్స్'తో గాంధీ కుటుంబానికి ఉన్న సంబంధాలేమిటో దేశ ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల వెనుక ఉన్న ఉద్దేశాలను ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ భూముల విక్రయాలపై నిలదీత

రాష్ట్రంలో ప్రభుత్వ భూములను విక్రయించడం, తాకట్టు పెట్టి పాలన సాగించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని రాంచందర్‌రావు విమర్శించారు. గత 34 నెలల్లో భూముల అమ్మకాల ద్వారా వచ్చిన రూ.30 వేల కోట్లను ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిని పక్కనపెట్టి వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారని ఆరోపించారు. డిసెంబర్ 23 నుంచి ఇప్పటివరకు అమ్మిన భూముల వివరాలతో పాటు వాటి ద్వారా వచ్చిన ఆదాయం, చేసిన ఖర్చుల లెక్కలను వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. రాష్ట్ర సంపదను దెబ్బతీసే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. భూముల విక్రయాలపై ప్రభుత్వం సమగ్ర లెక్కలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రామాల్లో పట్టు కోసం కరణం వెంకటేష్ కార్యాచరణ

చీరాల నియోజకవర్గంలో త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కసరత్తు ప్రారంభించింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం చీరాల రామకృష్ణాపురం క్యాంపు కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో విస్తృత సమావేశం నిర్వహించారు. ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను సమీక్షిస్తూ, ప్రజలు అందించిన మద్దతును నిలబెట్టుకోవాలని వెంకటేష్ సూచించారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో అనుసరించాల్సిన క్షేత్రస్థాయి వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తుఫాన్ అనంతరం నెలకొన్న పారిశుధ్య సమస్యలు, విద్యుత్ కోతలు, మౌలిక సదుపాయాల కొరతపై ప్రజల తరఫున పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, వైసీపీ మద్దతుదారులను అత్యధిక స్థానాల్లో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.



స్టార్టప్‌లకు టాటా హబ్

- అంతర్జాతీయ గుర్తింపు!



ఆంధ్రప్రదేశ్‌లో స్టార్టప్‌లు, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (డబ్ల్యూఐపీవో) సహకారం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. విశాఖలో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో డబ్ల్యూఐపీవో డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌తో ఆయన సమావేశమయ్యారు. స్టార్టప్ వ్యవస్థాపకులు, విద్యార్థులు, పరిశోధకులకు పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, డిజైన్లు, మేధో సంపత్తి హక్కులపై శిక్షణ ఇచ్చేందుకు ఏపీ-డబ్ల్యూఐపీవో అకాడమీ ఏర్పాటు చేసే అంశాన్ని చర్చించారు. చేనేత, హస్తకళలు, స్థానిక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో బ్రాండింగ్, ప్రచారానికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో స్టార్టప్‌ల అభివృద్ధి కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో డబ్ల్యూఐపీవో భాగస్వామి కావాలని ఆహ్వానించారు. క్వాంటం టెక్నాలజీ, ఏఐ రంగాల్లో ఏపీ చేస్తున్న కృషిని డారెన్ టాంగ్ అభినందించారు.

10 లక్షల మంది మహిళా వ్యాపారవేత్తలు

రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు క్వాంటం టెక్నాలజీ, కృత్రిమ మేధ, అంతరిక్ష సాంకేతికత, గ్రీన్ ఎనర్జీ, సహజ వ్యవసాయ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఆధునిక సాంకేతికతలో యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి భవిష్యత్తు అవసరాలకు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. 10 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్ ద్వారా గుర్తింపు కల్పిస్తున్నట్లు వివరించారు. వారి ఉత్పత్తులకు మేధో సంపత్తి హక్కుల రక్షణ, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు కల్పించేందుకు డబ్ల్యూఐపీవో సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాలనలోనూ సాంకేతికతను వినియోగిస్తూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు. స్టార్టప్ వ్యవస్థను బలోపేతం చేయడం, మహిళా సాధికారతకు అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని వినియోగించుకోవడం ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చాయి.

ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్‌పై యూఏఈ ఆసక్తి!

- మారిటైమ్, ఏరోస్పేస్ రంగాల్లోనూ భాగస్వామ్యం



ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, ఎగుమతుల రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని దుబాయ్, యూఏఈకి చెందిన ప్రముఖ కంపెనీలను ఆహ్వానించారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ సదస్సుకు హాజరైన యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీతో సీఎం సమావేశమయ్యారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే ఈ ప్రాంతం నుంచి పండ్లు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. యూఏఈ ఏర్పాటు చేయనున్న ఫుడ్ క్లస్టర్‌లో తమ దేశానికి చెందిన అగ్రిఫుడ్ సంస్థ సిలాల్ పెట్టుబడులు పెట్టాలని కోరారు. చిత్తూరు జిల్లాలో దుబాయ్‌కి చెందిన ఫ్లోర్‌మాస్టర్ పరిశ్రమ ఏర్పాటుపైనా చర్చించారు. ఫుడ్ క్లస్టర్ విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని యూఏఈ మంత్రిని కోరారు. మారిటైమ్, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లోనూ పెట్టుబడులకు ఏపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ఏపీ పెట్టుబడులకు కీలక కేంద్రం

భోగాపురం విమానాశ్రయం అద్భుతంగా ఉందని యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ ప్రశంసించారు. అత్యాధునిక విమానాశ్రయాన్ని నిర్మించినందుకు చంద్రబాబును అభినందించారు. భారత తూర్పు తీరంలో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ ఆసక్తిగా ఉందని, ఆంధ్రప్రదేశ్ తమ పెట్టుబడులకు కీలక కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. గూగుల్ వంటి సంస్థల డేటా సెంటర్లు, ప్రముఖ కంపెనీలు ఏపీకి రావడం సానుకూల పరిణామమని అన్నారు. రాష్ట్రం నుంచి రొయ్యలతో పాటు ఇతర ఆక్వా ఉత్పత్తులను దిగుమతి చేసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు యూఏఈ ప్రతినిధులు తెలిపారు. ఏపీలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ క్లస్టర్‌లో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈకి చెందిన మరో 12 కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో ఇరు దేశాల అధికారులు, కంపెనీల ప్రతినిధులు, ఏపీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సింగపూర్‌తో ఏపీ భాగస్వామ్యం

- ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌పై చంద్రబాబు దృష్టి



ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సింగపూర్‌తో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఏపీ-సింగపూర్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అమలుపై బుధవారం అమరావతి క్యాంపు కార్యాలయంలో మూడో జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సింగపూర్ ప్రభుత్వ మంత్రి గన్ సియో హువాంగ్ నేతృత్వంలోని 14 మంది సభ్యుల బృందంతో చంద్రబాబు చర్చలు జరిపారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ టౌన్‌షిప్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. 2027 మార్చి నాటికి అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్లు, అంతరిక్షం, డ్రోన్ల రంగాల్లో ప్రత్యేక హబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇటీవల తుపాను సమయంలో నాలుగు రోజుల్లోనే 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించినట్లు సింగపూర్ బృందానికి తెలిపారు.

ఆరు నెలలకోసారి ప్రగతి సమీక్ష

రాష్ట్రంలో చేపడుతున్న భాగస్వామ్య కార్యక్రమాల పురోగతిపై సింగపూర్ మంత్రి గన్ సియో హువాంగ్ ప్రశంసలు వ్యక్తం చేశారు. సివిల్ సర్వీసుల సంస్కరణల కోసం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారని ప్రతినిధి బృందం తెలిపింది. ఏడుగురు జిల్లా కలెక్టర్లు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు వెల్లడించింది. ఈ భాగస్వామ్యాన్ని లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేసేందుకు ఇరు పక్షాలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు సూచించారు. స్పష్టమైన మైలురాళ్లు నిర్ణయించి, ప్రతి ఆరు నెలలకు ఒకసారి పురోగతిని సమీక్షించాలని నిర్దేశించారు. 2027 మార్చి వరకు ఒక కార్యాచరణ ప్రణాళిక, 2028 మార్చి వరకు మరో ప్రణాళికను ప్రాధాన్యతల ఆధారంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. సింగపూర్ అనుభవం, ప్రపంచస్థాయి ఉత్తమ విధానాలను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఉద్యోగులకు రెండో శనివారం

సెలవు యథాతథం

- ఎన్నికలు, దసరా విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఊరట

ఏపీ జేఏసీ అమరావతి విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అక్టోబర్ 19న దసరా ముందస్తు సెలవు ప్రకటించడంతో దానికి బదులుగా నవంబర్ 14 రెండో శనివారాన్ని పని దినంగా ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్ఐఆర్ కార్యక్రమం, దసరా ఉత్సవాలు, సరస్ కార్యక్రమాల విధుల్లో భాగంగా అక్టోబర్ 19న కూడా పనిచేసిన ఉద్యోగులకు మరో సెలవు కోల్పోకూడదని ఏపీ జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు అక్టోబర్ 21న వినతిపత్రం సమర్పించింది. తాజాగా నవంబర్ 11న జారీ చేసిన ఉత్తర్వులతో ఎన్నికలు, దసరా, సరస్ తదితర విధుల్లో పాల్గొన్న గ్రామ సచివాలయం నుంచి జిల్లా స్థాయి వరకు ఉద్యోగులందరికీ నవంబర్ 14న యథాతథంగా సెలవు వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వానికి ఏపీ జేఏసీ కృతజ్ఞతలు తెలిపింది.

విద్యాశాఖకు సింగపూర్ శిక్షణ బలం!

- టీచర్ల, ఉన్నతాధికారులకు ప్రత్యేక శిక్షణ
- ప్రతి ఉపాధ్యాయుడికీ అంతర్జాతీయ నైపుణ్యం



ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో బోధనా ప్రమాణాలు పెంచేందుకు సింగపూర్ సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి నారా లోకేష్ తెలిపారు. అమరావతిలో జరిగిన మూడో ఏపీ-సింగపూర్ జాయింట్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఆరుగురు మంత్రులు, 37 మంది ఉపాధ్యాయులకు సింగపూర్‌లో ఇచ్చిన శిక్షణ మంచి ఫలితాలిచ్చిందని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను వేసవి సెలవుల్లో సింగపూర్‌కు పంపించి ఆధునిక బోధనా పద్ధతుల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. అక్కడ నేర్చుకున్న పాఠాలను తిరిగొచ్చిన టీచర్లు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల ద్వారా ఇతర ఉపాధ్యాయులకు అందించాలని ఆదేశించారు. శిక్షణ కొందరికే పరిమితం కాకుండా రాష్ట్రంలోని ప్రతి ఉపాధ్యాయుడికి చేరాలని స్పష్టం చేశారు. విద్యాశాఖలో మార్గదర్శకత్వం, దిశానిర్దేశం, పరిపాలన అనే మూడు అంశాలపై సామర్థ్యాల పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

డిజిటల్ పాలన, నాయకత్వ నైపుణ్యాలకు ప్రాధాన్యం

సింగపూర్ సహకారాన్ని విద్యాశాఖకే పరిమితం చేయకుండా డిజిటల్ గవర్నెన్స్, రియల్‌టైమ్ గవర్నెన్స్, నైపుణ్యాభివృద్ధి, అధికారుల నాయకత్వ శిక్షణకు విస్తరించాలని లోకేష్ కోరారు. మంత్రులు, సంబంధిత శాఖల కార్యదర్శులకు కలిపి శిక్షణ ఇస్తే విధాన నిర్ణయాలు, అమలులో సమన్వయం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. డేటా ఆధారిత నిర్ణయాలు, సమీకృత డిజిటల్ వేదికలు, కమాండ్ కంట్రోల్ కేంద్రాల నిర్వహణలో సింగపూర్ అనుభవాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గతంలో తుపానుల కారణంగా కొన్ని కార్యక్రమాలు ఆలస్యమైనా, ఇకపై వేగవంతం చేస్తామని తెలిపారు. కమిటీ నిర్ణయాల అమలును ప్రతి ఆరు నెలలకోసారి సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించినట్లు అధికారులు వివరించారు. సింగపూర్ ప్రతినిధి బృందం ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించింది. సమావేశంలో ఇరు ప్రభుత్వాల ఉన్నతాధికారులు, సింగపూర్ మంత్రి గన్ సియో హువాంగ్ నేతృత్వంలోని ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

- నిరంతరం అందుబాటులో ఉండాలి
- అనంతపురం కొత్త మేయర్‌కు జగన్ ప్రశంసలు



అనంతపురం నగర నూతన మేయర్‌గా ఎన్నికైన సి. రమేష్ గౌడ్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రమేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన జగన్.. నగర ప్రజలు వైఎస్సార్‌సీపీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. నగరాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ అన్నివర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. అధికార కూటమి నుంచి ఎన్ని ప్రలోభాలు, బెదిరింపులు ఎదురైనా పార్టీకి అండగా నిలిచిన ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యతని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి మంచి పేరు సంపాదించాలని రమేష్ గౌడ్‌ను ఆశీర్వదించారు.

నగరాభివృద్ధికి కృషి చేస్తా

తనపై నమ్మకంతో మేయర్‌గా అవకాశం కల్పించిన జగన్‌కు రమేష్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రయాణంలో అండగా నిలిచిన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అనంతపురం నగర ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. మేయర్ పదవిని బాధ్యతగా భావించి ప్రజా సమస్యల పరిష్కారానికి, నగరాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ గౌడ్ కుటుంబ సభ్యులతో పాటు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అనంత వెంకట్రామిరెడ్డి, సాకే శైలజానాథ్, తలారి రంగయ్య, నరేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెట్టుబడులే కాదు పర్యావరణమూ ముఖ్యం!

- సీఐఐ సదస్సుకు బొలిశెట్టి విజ్ఞప్తి

విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరుగుతున్న 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2026కు హాజరవుతున్న భారత ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, ఏపీ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సహా ప్రముఖులకు పర్యావరణ కార్యకర్త, జల బిరాదరి జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ స్వాగతం పలికారు. సుమారు 3,000 మంది ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు రావాలని ఆకాంక్షించారు. అదే సమయంలో కాలుష్యరహిత పరిశ్రమలు, గ్రీన్ టెక్నాలజీ, నీటి వనరుల పరిరక్షణ కార్బన్ ఉద్గారాల నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఐఐకి విజ్ఞప్తి చేశారు. 2026 యేల్ పర్యావరణ పనితీరు సూచీ ప్రకారం 177 దేశాల్లో భారత్ 176వ స్థానంలో ఉందని పేర్కొంటూ పర్యావరణ సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేశారు.

డేటా సెంటర్లపై శాస్త్రీయ చర్చ జరగాలి

హైపర్‌స్కేల్ డేటా సెంటర్ల ఏర్పాటుపైనా బొలిశెట్టి కీలక ప్రశ్నలు లేవనెత్తారు. వీటికి అవసరమైన భారీ విద్యుత్, నీటి వినియోగం పర్యావరణంపై చూపే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయాలని సూచించారు. వేల మెగావాట్ల డేటా సెంటర్ల వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలు, నీటి అవసరాలు, విద్యుత్ సరఫరా, పర్యావరణ ప్రభావాలపై సదస్సులో బహిరంగంగా శాస్త్రీయ చర్చ జరగాలని కోరారు. రాజకీయ నిర్ణయాలకు పరిమితం కాకుండా నిపుణుల అధ్యయనాల ఆధారంగా విధానాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సీఐఐ సదస్సు కేవలం పెట్టుబడుల వేదికగా మిగలకుండా పర్యావరణ పరిరక్షణతో కూడిన పారిశ్రామిక అభివృద్ధికి ప్రపంచానికి మార్గదర్శకంగా నిలవాలని బొలిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు.



కామారెడ్డి హామీలకు కాంగ్రెస్ తిలోదకాలు!

- మూడేళ్లలో బీసీలకు నెరవేరని వాగ్దానాలు

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ. చిరంజీవులు విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కామారెడ్డి హామీలు - దగాపడ్డ బీసీలు' అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల సంక్షేమానికి ఏటా రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ మూడేళ్లలో రూ.60 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.33 వేల కోట్లే కేటాయించిందన్నారు. అందులోనూ సుమారు రూ.6 వేల కోట్లకు మించి ఖర్చు చేయలేదని గణాంకాలతో వివరించారు. డిక్లరేషన్‌లోని 21 హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, 42 శాతం రాజకీయ రిజర్వేషన్ల హామీని కేంద్రానికి పంపి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకుందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని, అధికారంలోకి వచ్చాక హక్కులను విస్మరించిందని ధ్వజమెత్తారు. బీసీలు ఉద్యమాలతోపాటు ఎన్నికల్లోనూ చురుగ్గా పాల్గొనాలని మాజీ డీజీపీ పూర్ణచందర్‌రావు పిలుపునిచ్చారు. కులాలకు అతీతంగా బీసీలంతా ఐక్యమై హక్కుల కోసం పోరాడాలని మాజీ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీల అణచివేతను ఎదుర్కొనేందుకు సంఘటిత పోరాటం అవసరమని బాలగోని బాలరాజు గౌడ్ అన్నారు. ఆత్మగౌరవం, రాజకీయ వాటా సాధించుకోవాలని చిన్నరాములు ముదిరాజ్, ఎన్నికల్లో పోటీ చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు బీసీ సంఘాల నేతలు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు.. ఎన్నాళ్లీ భ్రమలు?

రేపు మాపంటూ ఇంకెన్నాళ్లు యువరానర్

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల వార్త మళ్లీ తెరపైకి వచ్చింది. హైదరాబాద్‌లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే స్థలాలు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లాల జర్నలిస్టుల సంగతి చూస్తామన్నారు. బుధవారం టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ నేతృత్వంలోని బృందం మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చింది. ఆరోగ్య భద్రతకు ప్రత్యేక పథకం అమలు చేయాలని కోరింది. ముఖ్యమంత్రి, మంత్రి గతంలో ఇచ్చిన హామీలకు కృతజ్ఞతలు చెప్పిన నేతలు, ప్రక్రియ వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే జర్నలిస్టుల ప్రశ్న ఒక్కటే.. ఈ వార్త ఇంకెన్ని సార్లు రాయాలి యువరానర్? రేపు మాపంటూ కాలం గడపకుండా హామీలకు ముగింపు పలికి స్థలాలు ఎప్పుడిస్తారో తేదీ చెప్పండి. ఎన్నాళ్లీ ఆశల ఊరింపు?

నవజాత శిశు సంరక్షణకు డిజిటల్ పర్యవేక్షణ బలోపేతం



నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ఎఫ్‌బీఎన్‌సీ పోర్టల్ వినియోగాన్ని విస్తరిస్తోంది. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో మంగళగిరి చినకాకాని హాయిలాండ్‌లో రెండు రోజుల ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. రాష్ట్రంలోని 70 ఆరోగ్య కేంద్రాలకు చెందిన 210 మంది వైద్యులు, స్టాఫ్ నర్సులు, సమాచార నమోదు సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. పోర్టల్‌లో శిశువుల ఆసుపత్రి ప్రవేశం, డిశ్చార్జి, వైద్య సేవల వివరాల నమోదు, ధ్రువీకరణ, నివేదికలు, డ్యాష్‌బోర్డు వినియోగంపై ప్రాయోగిక శిక్షణ ఇచ్చారు. ఎస్ఎన్‌సీయూ, ఎన్‌బీఎస్‌యూ విభాగాల పనితీరును పర్యవేక్షించి సేవల్లో లోపాలను గుర్తించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. సమాచార ఆధారిత నిర్ణయాలతో వైద్య సేవల నాణ్యత పెంచి, నవజాత శిశు మరణాలు, అనారోగ్య సమస్యలను తగ్గించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని వెల్లడించారు.

అధికార పార్టీలో చేరాక మారిన సీను!

- ఫ్యాను ఆపి సైకిల్ ఎక్కితే.. అంతా సవ్యమేనా?
- సహస్ర కుల ధ్రువీకరణపై కోర్టులో పంచాయితీ!



వైసీపీలో ఉండి ఉంటే అడ్డంకులు.. టీడీపీలోకి వచ్చాక అంతా సజావుగా సాగిందా? ఇప్పుడు విజయనగరం జిల్లా రాజకీయాల్లో ఇదే చర్చ. చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర కుల ధ్రువీకరణ పత్రంపై వివాదాలు ఉన్నప్పటికీ, ఆమెను జెడ్పీ చైర్‌పర్సన్ పీఠంపై కూర్చోబెట్టేందుకు మార్గం సుగమమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు చిన్న శ్రీను టీడీపీలో చేరడం, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా కండువా కప్పి ఆహ్వానించడం ఈ వ్యవహారంలో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అప్పటి వరకు ఉన్న అభ్యంతరాలు పార్టీ మార్పుతో పక్కకు వెళ్లిపోయాయా? ఇదే పని ఆయన వైసీపీలో ఉండి ఉంటే అధికార పక్షం నామినేషన్ దశలోనే అడ్డుకునేది కాదా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. సిరిసహస్ర నామినేషన్ ఆమోదం పొందడం, ఆమె గెలుపు కూడా ఇప్పుడు వివాదానికి కేంద్రంగా మారాయి.

కోర్టు నివేదిక కోరింది.. బాధ్యత ఎవరిది?

సిరిసహస్ర కుల ధ్రువీకరణ పత్రం, నామినేషన్ అర్హతపై వైసీపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని కోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. ఓసీకి కేటాయించిన స్థానంలో బీసీ ధ్రువీకరణ పత్రంతో నామినేషన్ దాఖలు చేయడం, అదే ప్రాతిపదికన ఫీజు చెల్లించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 20న జరగనున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికలోగా కోర్టు తుది నిర్ణయం వస్తుందా? తీర్పు వెలువడకముందే ఆమె ఆ పదవిని చేపడితే తదుపరి పరిణామాలేమిటి? అన్నది ఉత్కంఠగా మారింది. చీపురుపల్లి, గజపతినగరం ఎన్నికల ఫలితాలపైనా చిన్న శ్రీను రాజకీయ వ్యూహాల ప్రభావం ఉందన్న ప్రచారం సాగుతోంది. అయితే ఆరోపణలు నిజమా కాదా అనేది న్యాయస్థానం తేల్చాల్సి ఉంది. నామినేషన్‌లో తప్పు జరిగితే బాధ్యత ఎవరిది? దానికి మూల్యం ఎవరు చెల్లిస్తారు? అన్న ప్రశ్నలకు అధికార యంత్రాంగం సమాధానం చెప్పాల్సి ఉంది.



హిందువు కానీ హిందువుగా చరిత్ర సృష్టించిన ధీర

ఈ పరిణామంలో అన్నా ప్రయాణాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. రష్యాలో జన్మించిన ఆమెకు తెలుగు మాతృభాష కాదు.. భారతీయ సంప్రదాయాలు పుట్టుకతో వచ్చినవి కావు. అయినప్పటికీ వివాహ బంధం ద్వారా తన జీవితంలో భాగమైన తెలుగు కుటుంబ సంస్కృతిని గౌరవించారు. భర్త విశ్వాసాలకు విలువిచ్చారు. పిల్లల పేర్లలో కుటుంబ గుర్తింపుకు స్థానం కల్పించారు. తిరుమలలో మొక్కులు చెల్లించడంతో పాటు భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల్లోనూ భాగమయ్యారు. తన పేరుతో కొణిదెల కుటుంబ గుర్తింపును ముడిపెట్టుకున్నారు. ఇవన్నీ ఆమె వ్యక్తిగత జీవిత ప్రయాణంలో చెరగని ఘట్టాలు. అయితే ఒక మహిళ భర్త కుటుంబ సంప్రదాయాలను పాటించినప్పుడే గొప్పదనే భావన సరికాదు. పాటించకపోతే తక్కువనే అభిప్రాయమూ తప్పే. వ్యక్తుల మధ్య అసలైన అనుబంధం పరస్పర గౌరవంలోనే ఉంటుంది. ఒకరి విశ్వాసాలను మరొకరు గౌరవించడం, భిన్నమైన సంస్కృతులను అర్థం చేసుకోవడమే బంధాలకు బలాన్నిస్తుంది. వివాహ బంధానికి ముగింపు పలకాలని ఇద్దరు వ్యక్తులు నిర్ణయించుకున్నా, కలిసి గడిపిన పదమూడు సంవత్సరాల జ్ఞాపకాలను చెరిపేయలేరు. ఆ అనుబంధంలో భాగమైన కుటుంబ అనుభవాలు, పిల్లలతో ముడిపడిన జ్ఞాపకాలు ఎప్పటికీ వారి జీవితాల్లో నిలిచిపోతాయి. అన్నా లెజినోవా నుంచి అన్నా కొణిదెల వరకు సాగిన ఆమె ప్రయాణం కూడా అలాంటిదే. ఒక విదేశీ మహిళగా తెలుగు కుటుంబంలోకి అడుగుపెట్టి, ఆ ఇంటి సంప్రదాయాలను గౌరవిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు జీవితంలో మరో అధ్యాయానికి సిద్ధమవుతున్న ఆమెను కేవలం పవన్ కళ్యాణ్ మాజీ భార్యగా మాత్రమే చూడలేం. తనదైన వ్యక్తిత్వం, విశ్వాసాలు, అనుభవాలతో ప్రత్యేకమైన జీవన ప్రయాణం సాగించిన మహిళగా గుర్తించాలి. వివాహ బంధం కొనసాగకపోయినా, తెలుగు కుటుంబంతో ఏర్పడిన అనుబంధం, భారతీయ సంస్కృతిపై ఆమె చూపిన గౌరవం మాత్రం ఆమె జీవిత కథలో ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంటాయి.



రష్యా మహిళ నమో భారతీయం

అన్నా లెజినోవా ప్రయాణం!

రష్యాలో పుట్టి.. తెలుగు కోడలిగా 13 ఏళ్ల అనుబంధమూ చరిత్ర





అన్నా గురించి మాట్లాడేటప్పుడు ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. ఆమె హిందూ మతంలోకి అధికారికంగా మారిందనే ఆధారాలు లేవు. ఆమె రష్యన్ ఆర్థడాక్స్ క్రైస్తవ సంప్రదాయానికి చెందిన మహిళగానే కొనసాగినట్లు జనసేన ప్రకటనలు, అప్పటి మీడియా కథనాలు పేర్కొన్నాయి. పవన్ కళ్యాణ్‌తో ఆమె వివాహం 2013 సెప్టెంబరులో జరిగింది. అయితే వివాహం తర్వాత కొణిదెల ఇంటిపేరును స్వీకరిం చడం ద్వారా తన కుటుంబ అనుబంధాన్ని బహిరం గంగా ప్రకటించారు. 2026 జూలైలో తనను అన్నా కొణిదెలగానే పిలవాలని ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టారు. ఈ పరిణామం వెనుక ఒక భావోద్వేగం ఉంది. పుట్టినింటి పేరు వదిలేయడం కాదు. మెట్టినింటి గుర్తింపును కూడా తన వ్యక్తిత్వంలో భాగం చేసుకోవడం. ఒక మహిళకు తన పేరును ఎంచుకునే స్వేచ్ఛ ఉంటుంది. అదే సమయంలో తాను ప్రేమిం చిన కుటుంబం పేరును గౌరవంగా ధరించాలనే అభిలాష కూడా ఉంటుంది. అన్నా విషయంలో ఈ రెండూ కనిపించాయి. విదేశీ మహిళగా భారత దేశాని కి వచ్చిన ఆమె క్రమంగా తెలుగు కుటుంబానికి పరిచయమైన వ్యక్తిగా మారారు. ఆమెను అభిమానులు అంగీకరించడానికి ప్రధాన కారణం కూడా ఇదే. అయితే పేరు మార్చుకోవడం ఒక్కటే భారతీయతకు కొలమానం కాదు. ఆ పేరుతో ముడిపడిన కుటుంబ బాధ్యతలు, ఆప్యాయత, అనుబంధాలను ఆమె ఎలా స్వీకరించారన్నదే అసలు విషయం.

ఇంటి గడప దాటిన సంప్రదాయం.. మనసుల్లో అన్నా!

2018లో పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటనకు బయలుదేరిన సందర్భంలో అన్నా చేసిన సంప్రదాయ పూర్వక వీడ్కోలు అభిమానుల దృష్టిని ఆకర్షిం చింది. భర్తకు హారతి ఇవ్వడం, నుదుటిపై తిలకం దిద్దడం, కారు ముందు కొబ్బరికాయ కొట్టి దిష్టి తీయడం వంటి ఆచారాలను ఆమె ఆచరించారు. కొబ్బరికాయ కొట్టే విధానం కూడా పవన్ సైగలతో వివరించినట్లు అప్పట్లో ప్రసారమైన దృశ్యాలు గుర్తుం డిపోయాయి. ఆ చిన్న సంఘటనలోనే అభిమానులు ఒక పెద్ద భావాన్ని చూశారు. ఒక విదేశీ మహిళ తనకు తెలి యని ఆచారాన్ని నేర్చుకోవడానికి ప్రయత్ని ంచడం. భర్త నమ్మకాలను గౌరవించడం. కుటుంబ ంలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలకు చోటివ్వడం. ఇవన్నీ కేవలం కెమెరా ముందు జరిగిన దృశ్యా లుగా మాత్రమే చూడలేం. అయితే ఒకటి 2 ఫోటోల ఆధా రంగా ఆమె వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా అంచనా వేయడం కూడా సరైంది కాదు. కుటుంబ కార్యక్రమ ంలో పవన్ పెద్దలకు నమస్కరించడానికి వంగినప్పుడు అన్నా ఆయన చెప్పులను పక్కకు తీసి పట్టుకున్న దృశ్య ం కూడా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ఆ ఫోటోను అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటు న్నారు. అందులో వారికి కనిపించింది చెప్పులు పట్టు కున్న భార్య కాదు. కుటుంబంలోని పెద్దలకు గౌరవం ఇచ్చే సంస్కారాన్ని అర్థం చేసుకున్న మహిళ. మన సమాజంలో ఇటువంటి చిన్న దృశ్యాలకు కూడా పెద్ద భావోద్వేగ విలువ ఉంటుంది. ముఖ్యంగా సెలబ్రిటీల జీవితాల్లో సాధారణంగా కనిపించని కుటుంబ ఆప్యాయతను ప్రజలు ఎక్కువగా గమనిస్తారు.

భార్యగానే కాదు.. తల్లిగా కూడా భారతీయత!

ఒక కుటుంబంలో నిజమైన అనుబంధం ఏర్పడేది పిల్లల పెంపకంలోనూ కనిపిస్తుంది. అన్నా, పవన్ కళ్యాణ్ దంపతులకు పోలేనా అంజనా పవనోవా, మార్క్ శంకర్ పవనోవిచ్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి పేర్లలోనే రెండు సంస్కృతుల కలయిక కనిపిస్తుంది. రష్యన్ నేపథ్యం ఒకవైపు. తెలుగు కుటుంబ అనుబంధం మరోవైపు. ముఖ్యంగా మార్క్ పేరులోని శంకర్ అనే పదం మెగా కుటుంబంలోని పెద్దల పేరుతో ముడిపడిన కుటుంబ గుర్తింపుగా అభిమానులు భావిస్తారు. పవన్ మొదటి వివాహం ద్వారా జన్మించిన అకిరా నందన్, ఆద్యలతో కూడా అన్నా స్నేహపూర్వకంగా కనిపించిన సందర్భాలు ఉన్నాయి. ఒక వ్యక్తి గత కుటుంబ సంబంధాలను గౌరవించడం కూడా కుటుంబ జీవితంలో ముఖ్యమైన అంశం. అయితే ఈ బంధాల లోతు గురించి బయటివారు తీర్పులు ఇవ్వలేరు. పిల్లల విషయంలో మాత్రం అన్నా, పవన్ ఇద్దరూ ఒకే బాధ్యతను పంచుకున్నట్లు వారి సంయుక్త ప్రకటనలో స్పష్టమైంది. వివాహ బంధం ముగిసినా పిల్లల సంతోషం, భవిష్యత్తు తమ ఉమ్మడి ప్రాధాన్యమని వారు ప్రకటించారు. అదే ఈ కథలో అత్యంత ముఖ్యమైన అంశం. భార్యాభర్తల మధ్య వ్యక్తిగత నిర్ణయాలు ఏవైనా ఉండవచ్చు. కానీ పిల్లల జీవితంపై వాటి ప్రభావం పడకుండా చూడాల్సిన బాధ్యత ఇద్దరిదీ. అన్నా ప్రయాణాన్ని కేవలం భార్యగా ఆమె చేసిన పనులతోనే కొలవలేం. ఒక తల్లిగా, రెండు సంస్కృతుల మధ్య పెరిగిన పిల్లలకు కుటుంబ గుర్తింపును అందించిన వ్యక్తిగా కూడా చూడాలి.

తిరుమలలో తలనీలాలు.. ఒక తల్లి మొక్కులో ఆర్ద్ర!

అన్నా ప్రయాణంలో అత్యంత భావోద్వేగమైన ఘట్టం 2025 ఏప్రిల్‌లో జరిగింది. సింగపూర్‌లోని పాఠశాల వేసవి శిబిరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డాడు. చేతులు, కాళ్లకు కాలిన గాయాలయ్యాయి. పొగ పీల్చడం వల్ల కూడా ఇబ్బంది ఎదురైంది. ఆ సమయంలో తల్లిదండ్రులుగా పవన్, అన్నా ఎదుర్కొన్న ఆందోళన సాధారణమైనది కాదు. బిడ్డకు ప్రమాదం జరిగినప్పుడు తల్లికి మతం, దేశం, భాష అనే తేడాలు ఉండవు. బిడ్డ క్షేమంగా తిరిగి రావాలన్న ప్రార్థనే ఉంటుంది. మార్క్ కోలుకున్న తర్వాత అన్నా తిరుమల వెళ్లి తన మొక్కు తీర్చుకున్నారు. తలనీలాలు సమర్పించారు. వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొన్నారు. శ్రీవారిపై తనకు విశ్వాసం ఉందని టీటీడీ నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇచ్చారు. కుమారుడి పేరు మీద అన్నదానానికి రూ. 17 లక్షలు విరాళంగా అందించారు. ఈ సంఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా వార్తలకెక్కింది. ఒక రష్యన్ ఆర్థడాక్స్ క్రైస్తవ మహిళ తిరుమలలో తలనీలాలు సమర్పించడం కంటే కూడా, తన కుమారుడి ప్రాణాలు క్షేమంగా ఉండాలని మొక్కుకుని ఆ మొక్కును నెరవేర్చడం ప్రజలను కదిలించింది. ఇక్కడ ఒక విషయాన్ని అర్థం చేసుకోవాలి. భక్తికి ఒకే భాష ఉండదు. ప్రార్థనకు ఒకే మతానికి చెందిన పదజాలం ఉండదు. తల్లి మనసులోని ఆర్తికి సరిహద్దులు ఉండవు. అన్నా చేసిన పని అభిమానులకు ఆ భావాన్ని గుర్తుచేసింది. ఆమె మతం మారిందని చెప్పడానికి ఇది ఆధారం కాదు. తన విశ్వాసంతో పాటు మరో సంప్రదాయంలోని ఆధ్యాత్మిక ఆచారాన్ని గౌరవించగలిగిందని చెప్పడానికి మాత్రం ఇది ఒక బలమైన ఉదాహరణ.

భారతీయత, సనాతన విలువలకు చిరునామాగా లెజినోవా!

తిరుమలతో అన్నా అనుబంధం అక్కడితో ఆగలేదు. పవన్ కళ్యాణ్‌కు భుజం సంబంధిత శస్త్రచికిత్స జరిగిన తర్వాత కూడా ఆమె తిరుమలకు వెళ్లినట్లు 2026 జూలైలో వార్తలు వచ్చాయి. ఈసారి అలిపిరి మెట్ల మార్గంలో కాలినడకన కొండ ఎక్కారు. వీఐపీ సౌకర్యా లను ఉపయోగించకుండా సాధారణ భక్తురాలిగా దర్శనం చేసుకున్నారు. భర్త ఆరోగ్యం కోసం ఆమె చేసిన ఈ ప్రయాణం మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఒకవైపు రాజకీయ బాధ్యతలు. మరోవైపు ప్రజా జీవితంలోని ఒత్తిళ్లు. ఇంకోవైపు కుటుంబ ఆరోగ్య సమస్యలు. ఈ నేపథ్యంలో ఆమె చేసిన ప్రయా ణాన్ని అభిమానులు భార్యగా చూపిన ఆప్యాయతగా చూశారు. ఇదే సమయంలో 2025 కుంభమేళాలో పవన్‌తో కలిసి ఆమె పాల్గొన్నట్లు వచ్చిన వార్తలు, 2026 ఫిబ్రవరిలో వరంగల్ భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన సందర్భం కూడా ఆమె భారతీయ ఆధ్యాత్మిక సంప్రదా యాల పట్ల చూపిన ఆసక్తిని తెలియజేస్తాయి. భద్రకాళి ఆలయంలో ఆది శంకరాచార్యులు, వల్లభ గణపతికి పూజలు చేసి, అనంతరం అమ్మవారిని దర్శించుకున్నట్లు అప్పటి కథనాలు వెల్లడించాయి. ఈ దృశ్యాలన్నీ కలిపి చూసినప్పుడు అన్నా ప్రయాణంలో ఒక నిరంతరత కనిపిస్తుంది. ఒక్కరోజు కెమెరా ముందు కనిపించడా నికి చేసిన పని కాదు. అనేక సందర్భాల్లో బయటపడిన ఆచరణ. అయితే ఆమె వ్యక్తిగత ఆధ్యాత్మిక అనుభవా లను ప్రచారానికి పరిమితం చేయడం కూడా తగదు. ఆమె ఏ మతానికి చెందినవారైనా, ఏ సంప్రదాయాన్ని అనుసరించినా అది ఆమె వ్యక్తిగత హక్కు.

పవన్ రాజకీయ ప్రయాణంలో తెరవెనుక సూత్రధారి!

పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం పూలబాట కాదు. పార్టీ నిర్మాణం నుంచి ఎన్నికల పోరాటం వరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ప్రజల్లో తిరగ డం, విమర్శలు ఎదుర్కోవడం, ఓటమి తర్వాత కూడా రాజకీయంగా నిలబడటం, చివరకు 2024 ఎన్నికల్లో కూటమి విజయంతో ఉప ముఖ్యమంత్రి స్థాయికి చేర డం.. ఈ ప్రయాణంలో కుటుంబం కూడా అనేక సవాళ ్లను ఎదుర్కొంది. 2026 జూన్‌లో అన్నా తన ఇన్‌స్టాగ్రా మ్‌లో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు ఈ కోణాన్ని మరింత స్పష్టం చేశాయి. పవన్ బయట రాజకీయ పోరాటాలు సాగిస్తున్నప్పుడు తాను ఇంట్లో పిల్లలను చూసుకుంటూ ఒంటరితనాన్ని, భయాన్ని ఎదుర్కొన్న రోజులు ఉన్నాయ ని ఆమె భావోద్వేగంగా రాసినట్లు వార్తలు వచ్చాయి. ఈ మాటల్లో ఒక రాజకీయ నాయ కుడి భార్యగా ఆమె ఎదుర్కొన్న మరో ప్రపంచం కనిపి స్తుంది. నాయకుడి ప్రసంగాలు ప్రజలకు వినిపిస్తాయి. సభల్లో ఆయన పోరాటం కనిపిస్తుంది. కానీ ఆ పోరా టం ఇంట్లో ఉన్న కుటుంబంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో బయటి వారికి అంతగా తెలియదు. పవన్ రాజకీయ జీవితం గురించి చర్చించే టప్పుడు ఆయన కుటుంబం ఎదుర్కొ న్న వ్యక్తిగత ఒత్తిళ్లను కూడా గుర్తిం చాలి. అన్నా పాత్ర ను జనసేన కార్యకర్తగా చిత్రీకరించా ల్సిన అవసరం లేదు. ఆమెను రాజకీయ వ్యూహకర్తగా ప్రకటించాల్సిన అవసరమూ లేదు. కానీ ఒక భార్యగా, తల్లిగా ఆ ప్రయాణంలో ఆమెకు ఎదురైన అనుభవాలను విస్మరించలేం.

విదేశీ నేల నుంచి తెలుగు సంస్కృతుల సంగమం!

2026లో అన్నా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన మరికొన్ని దృశ్యాలు కూడా చర్చలోకి వచ్చాయి. వరంగల్ భద్రకాళి ఆలయ సందర్శన, తిరుమల కాలినడక యాత్ర, పిఠాపురం పర్యటన వంటి సందర్భాల్లో ఆమె సాధారణ దుస్తుల్లో, చీరలో కనిపించడం అభిమానులను ఆకట్టుకుంది. స్థానికులతో కలిసిపోవడం, తెలుగులో మాట్లాడటానికి ప్రయత్నించడం వంటి అంశాలు కూడా సోషల్ మీడియాలో ప్రశంసలు పొందాయి. విశాఖపట్నం జంతుప్రదర్శనశాలలో ఏనుగు, రాయల్ బెంగాల్ పులి దత్తతకు సంబంధించిన వార్తలు కూడా ఆమె జంతు సంక్షేమ ఆసక్తిని చర్చకు తెచ్చాయి. ఈ వివరాల్లో ప్రతి అంశానికీ స్వతంత్ర అధికారిక నిర్ధారణ లభించనందున వాటిని నిర్ధారిత జీవిత చరిత్ర వాస్తవాలుగా కాకుండా ప్రచారంలోకి వచ్చిన కథనాలుగానే చూడాలి. అయినా ఈ పరిణామాలన్నింటిలో ఒక సాధారణ అంశం ఉంది. అన్నా తనను కేవలం ఒక ప్రముఖుడి భార్యగా మాత్రమే పరిచయం చేసుకోవడానికి ప్రయత్నించలేదు. తనకు నచ్చిన జీవనశైలిని, తన కుటుంబ గుర్తింపును, తన అభిరుచులను కూడా వ్యక్తం చేశారు. ఆమెకు రష్యన్ మూలాలు ఉన్నాయి. క్రైస్తవ మత విశ్వాసం ఉంది. అదే సమయంలో తెలుగు ఇంటిపేరు పట్ల అనుబంధం ఉంది. భారతీయ ఆచారాల పట్ల గౌరవం ఉంది. ఇవన్నీ పరస్పర విరుద్ధమైనవి కావు. ఒక మనిషి అనేక సంస్కృతులను గౌరవిస్తూ జీవించగలడని అన్నా ప్రయాణం గుర్తుచేస్తుంది.

విడిపోవాలనే నిర్ణయం..

పదమూడేళ్ల ప్రయాణానికి గుర్తింపు!

2026 నవంబర్ 9న పవన్ కళ్యాణ్, అన్నా సంయుక్త ప్రకటనతో ఈ బంధానికి అనూహ్య ముగింపు పలికారు. పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నా మని, వివాహ బంధం ముగిసినా మంచి స్నేహితులుగా కొనసాగుతామని, పిల్లల బాధ్యతను ఇద్దరూ పంచుకుంటామని స్పష్టం చేశారు. విడిపోవడానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. తమ వ్యక్తిగత జీవితానికి గౌరవం ఇవ్వాలని అభిమానులను కోరారు. ఈ ప్రకటనతో అభిమానుల్లో భావోద్వేగ చర్చ మొదలైంది. పవన్ రాజకీయ ప్రస్థానం, సినీ ప్రయాణం కంటే ఈసారి అన్నాతో ఆయనకున్న కుటుంబ అనుబంధమే ఎక్కువగా గుర్తుకొస్తోంది. భర్తకు హారతి ఇచ్చిన దృశ్యాలు, ఆయన చెప్పులు చేతపట్టుకున్న ఫొటోలు, కుమారుడి కోసం తిరుమలలో తలనీలాలు సమర్పించడం, పవన్ ఆరోగ్యం కోసం అలిపిరి మెట్లు ఎక్కడం వంటి సందర్భాలను అభిమానులు మళ్లీ గుర్తుచేసుకుంటున్నారు. ముఖ్యంగా విడిపోవాలనే ప్రకటనకు కొన్ని నెలల ముందే తనను 'అన్నా కొణిదెల'గా పిలవాలని ఆమె కోరిన విషయం ఇప్పుడు మరోసారి చర్చకు వచ్చింది. అప్పట్లో సాధారణంగా కనిపించిన ఆ మాటలకు ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో కొత్త ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ బంధం ముగింపునకు దారితీసిన అసలు కారణాలు ఏమిటో పవన్, అన్నా మాత్రమే చెప్పగలరు. వారి వ్యక్తిగత నిర్ణయం వెనుక ఉన్న పరిస్థితులను ఊహించడం, ఎవరికీ బాధ్యత ఆపాదించడం సమంజసం కాదు. కెమెరాల ముందు కనిపించిన ఆప్యాయత ఒక కుటుంబం అంతరంగాన్ని పూర్తిగా ఆవిష్కరించదు. అభిమానుల జ్ఞాపకాల్లో నిలిచిన ఆ మధుర క్షణాలకు గౌరవం ఇస్తూనే, వారి నిర్ణయానికి కూడా గౌరవం ఇవ్వాల్సిన సమయమిది.





మఠంలో ముఠాలు.. దేవాదాయశాఖ చోద్యం!

బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి నియామక వ్యవహారం దేవాదాయశాఖ పనితీరును బజారు కీడ్చింది. ఒక చారిత్రక ఆధ్యాత్మిక సంస్థకు అధిపతిని ఎంపిక చేసే విషయంలో చట్టం నిర్దేశించిన కనీస నిబంధనలను కూడా అమలు చేయలేని దుస్థితి బయటపడింది. శిష్యులకు నోటీసులు ఇవ్వలేదు. ఇతర మఠాల పీఠాధిపతులను ఆహ్వానించలేదు. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత కనిపించలేదు. ఆధ్యాత్మిక అర్హతల పరిశీలనకు తగిన ప్రాధాన్యం దక్కలేదు. చివరకు ఈ లోపాలను హైకోర్టు ఎత్తిచూపాల్సి వచ్చింది. చట్టాన్ని అమలు చేయాల్సిన శాఖే చట్టబద్ధమైన విధానాన్ని విస్మరించడం సాధారణ పరిపాలనా పొరపాటు కాదు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. మఠానికి పీఠాధిపతిని ఎంపిక చేయడం అంటే కార్యాలయంలో ఒక ఫైల్‌పై సంతకం చేసి ఉత్తర్వులు జారీ చేయడం కాదు. తరతరాలుగా కొనసాగుతున్న గురుశిష్య సంప్రదాయానికి వారసుడిని గుర్తించే బాధ్యత. అలాంటి కీలకమైన వ్యవహారంలోనే అధికారులు నిబంధనలను పక్కనపెడితే ఇక ధార్మిక సంస్థల పరిరక్షణకు దేవాదాయశాఖ ఉన్న ప్రయోజనం ఏమిటి? నిబంధనలు పుస్తకాల్లో ఉండటానికా? అధికారులు కుర్చీల్లో కూర్చోవడానికా? ప్రజల విశ్వాసంతో ముడిపడిన సంస్థల వ్యవహారాల్లోనూ ఇంతటి నిర్లక్ష్యం కొనసాగితే పరిపాలనా వ్యవస్థపై నమ్మకం ఎలా నిలుస్తుంది? ఇప్పుడు హైకోర్టు తీర్పు దేవాదాయశాఖ తీరుపై తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అధికారుల బాధ్యతను మరోసారి చర్చనీయాంశంగా మార్చింది.

- ధృతరాష్ట్ర పాలనకు న్యాయస్థానం తీర్పు చెంపపెట్టు
- హైకోర్టు తప్ప ఎత్తిచూపే వరకు నిద్రపోయిందా?
- శిష్యులకు నోటీసులేవి.. అధికారులకు బాధ్యతలేవి!

నియామకంలో లోపాలు.. నిబంధనలకు తూట్లు..!

ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ అండ్ హిందూ రిలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టం, 1987లోని సెక్షన్ 54(2), మఠాల పరిపాలన నియమావళి 1987 పీఠాధిపతి ఎంపికకు అనుసరించాల్సిన విధానాన్ని స్పష్టంగా నిర్దేశిస్తున్నాయి. సంబంధిత మఠానికి చెందిన శిష్యులకు సమాచారం ఇవ్వాలి. అదే సంప్రదాయానికి చెందిన ఇతర మఠాల పీఠాధిపతులను సమావేశానికి ఆహ్వానించాలి. కనీసం నెల రోజుల ముందుగా నోటీసులు జారీ చేయాలి. పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలి. మఠం, దేవాదాయశాఖ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో సమాచారం ప్రదర్శించాలి. ఇవన్నీ ఎవరో వ్యక్తిగతంగా కోరిన సౌకర్యాలు కావు. చట్టం కల్పించిన అవకాశాలు. వాటిని అమలు చేయాల్సింది అధికారులే. కానీ బ్రహ్మంగారి మఠం వ్యవహారంలో ఈ ప్రాథమిక విధానమే పాటించలేదని హైకోర్టు స్పష్టం చేసింది. నిబంధనలు తెలియని వ్యక్తులు ఈ ప్రక్రియను నిర్వహించలేదు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న అధికారులే వ్యవహరించారు. వారికి చట్టంపై అవగాహన ఉండాలి. దాన్ని అమలు చేయాలనే బాధ్యత ఉండాలి. అయినా నోటీసుల ప్రక్రియ ఎందుకు విస్మరణకు గురైందో తేలాల్సి ఉంది. చట్టాన్ని అమలు చేయాల్సిన శాఖే చట్టబద్ధమైన ప్రక్రియను విస్మరిస్తే అది పరిపాలనా వైఫల్యం కాక మరేమిటి? ప్రజలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకునే అధికారులు, తామే నిబంధనల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యత నుంచి తప్పించుకోలేరు. దేవాదాయశాఖలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కేవలం హోదాలకే పరిమితమైందనే విమర్శలకు ఈ వ్యవహారం బలం చేకూర్చింది. ఫైళ్లలో నిబంధనలు ఉన్నా క్షేత్రస్థాయిలో వాటి అమలును పట్టించుకునే వ్యవస్థ బలహీనపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శిష్యులు లేని సమావేశం.. అధికారుల ఇష్టారాజ్యమా?

మఠానికి చెందిన నిజమైన శిష్యుల అభిప్రాయాలు తెలుసుకోవడం పీఠాధిపతి ఎంపికలో అత్యంత కీలకం. గురుశిష్య సంప్రదాయం కొనసాగుతున్న మఠంలో శిష్యుల భాగస్వామ్యం లేకుండా ఎంపిక ప్రక్రియ సాగడం ఆ సంప్రదాయానికే విరుద్ధం. హైకోర్టు తన ఉత్తర్వుల్లో మఠానికి శిష్యులు ఉన్నారని గుర్తించింది. అయినప్పటికీ వారికి నోటీసులు జారీ చేయలేదని, సమావేశానికి ఆహ్వానించలేదని పేర్కొంది. ఇతర మఠాల పీఠాధిపతులు కూడా సమావేశానికి హాజరుకాలేదని స్పష్టం చేసింది. సమావేశానికి సంబంధించిన వీడియో రికార్డింగ్‌లో దేవాదాయశాఖ కమిషనర్ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న దృశ్యాలను న్యాయస్థానం ప్రస్తావించింది. ఈ పరిణామం ఎంపిక ప్రక్రియలోని లోపాలను మరింత స్పష్టంగా బయటపెట్టింది. మఠానికి చెందిన శిష్యులు ఉన్నారు. కానీ వారికి సమాచారం లేదు. సంప్రదాయాన్ని తెలిసిన ఇతర పీఠాధిపతులు ఉన్నారు. కానీ వారికి ఆహ్వానం లేదు. చివరకు సమావేశానికి వచ్చిన వ్యక్తుల నుంచి వినతిపత్రాలు స్వీకరించే ప్రక్రియ మాత్రమే కనిపించింది. ఇది పారదర్శకమైన ఎంపికకు నిదర్శనం కాదు. శిష్యుల అభిప్రాయాలను సేకరించాల్సిన బాధ్యతను అధికారులు సక్రమంగా నిర్వర్తించలేదనే విమర్శలకు ఇది ఆధారంగా మారింది. సమావేశానికి వచ్చిన ప్రతి ఒక్కరి వివరాలను పరిశీలించాలి. మఠంతో ఉన్న అనుబంధాన్ని నిర్ధారించాలి. శిష్యరికానికి సంబంధించిన వివరాలను నమోదు చేయాలి. కానీ అలాంటి సమగ్ర పరిశీలన జరిగినట్లు స్పష్టత లేదు. శిష్యుల స్వరానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన చోట వారి భాగస్వామ్యమే లేకుండా పోయింది. ఆధ్యాత్మిక సంస్థకు అధిపతిని ఎంపిక చేసే ప్రక్రియలో ఇదొక తీవ్రమైన లోపం.

ఒకే నమూనా అర్జీల వ్యవహారం.. విచారణ జరగాల్సిందే!

ఈ వ్యవహారంలో ఒకే తరహా నమూనాతో ఉన్నట్లు చెబుతున్న జిరాక్స్ అర్జీల అంశం కూడా చర్చకు వచ్చింది. కొన్ని పత్రాల్లో పేర్లు, ఊర్ల వివరాలు నింపి సమర్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలను హైకోర్టు నకిలీ పత్రాలుగా నిర్ధారించలేదు. అయినప్పటికీ వాటి విశ్వసనీయతపై సందేహాలు వ్యక్తమవుతున్నప్పుడు సంబంధిత రికార్డులను పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. ప్రతి అర్జీ వెనుక ఉన్న వ్యక్తి వివరాలు సేకరించాలి. మఠంతో అతనికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించాలి. నిజంగా గురూపదేశం పొందిన శిష్యుడేనా అనే అంశాన్ని పరిశీలించాలి. అర్జీని స్వయంగా సమర్పించారా అనే వివరాలు నమోదు చేయాలి. ఒకే నమూనాలో పత్రాలు తయారయ్యాయనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటి మూలాన్ని గుర్తించాలి. ఇవన్నీ అధికారులకు అసాధ్యమైన పనులేమీ కావు. కానీ ఈ అంశాలపై సమగ్ర పరిశీలన జరిగిందనే స్పష్టత బయటకు రావడం లేదు. ఒకవైపు మఠానికి చెందిన శిష్యులకు నోటీసులు ఇవ్వలేదు. మరోవైపు సమావేశానికి వచ్చిన వారి అర్హతలను ఎలా నిర్ధారించారో తెలియదు. ఇప్పుడు ఒకే తరహా అర్జీలపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్ని అంశాలు ఉన్నప్పుడు దేవాదాయశాఖ కనీసం అంతర్గత విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలి. అర్జీలు నిజమైనవైతే వాటి విశ్వసనీయతను నిరూపించాలి. అవకతవకలు ఉన్నట్లు తేలితే బాధ్యులను గుర్తించాలి. ఆరోపణలను కొట్టిపారేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. పత్రాలను పరిశీలించడం, వాస్తవాలను ప్రజల ముందు ఉంచడం ద్వారానే అధికారులపై నమ్మకం నిలుస్తుంది. ఈ వ్యవహారాన్ని తేలికగా తీసుకునే అవకాశం లేదు.

అధికారుల నిర్లక్ష్యానికి బాధ్యత ఎవరిది?

ఒక సాధారణ కార్యాలయ ఉత్తర్వులో పొరపాటు జరిగితే దాన్ని సరిదిద్దుకోవచ్చు. కానీ ఒక మఠానికి పీఠాధిపతిని ఎంపిక చేసే ప్రక్రియలో చట్టబద్ధమైన విధానమే విఫలమైతే దాని ప్రభావం సంస్థ భవిష్యత్తుపై పడుతుంది. అందుకే ఈ వ్యవహారంలో వ్యక్తుల వాదనల కంటే అధికారుల బాధ్యతను ముందుగా తేల్చాలి. సమావేశం నిర్వహించే ముందు నోటీసులు జారీ చేశారా? జారీ చేస్తే వాటి ఆధారాలు ఎక్కడ ఉన్నాయి? పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారా? మఠం నోటీసు బోర్డులో సమాచారం ఉంచారా? ఇతర మఠాల పీఠాధిపతులకు ఆహ్వానాలు పంపారా? శిష్యుల జాబితాను ఎవరు సిద్ధం చేశారు? హాజరైనవారి వివరాలను ఎవరు ధ్రువీకరించారు? సమావేశానికి సంబంధించిన వీడియో, హాజరు పట్టిక, వినతిపత్రాలు, కార్యాలయ నోట్‌ఫైళ్లు అన్నింటినీ పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు తమ బాధ్యతను ఎలా నిర్వర్తించారో ప్రభుత్వం సమీక్షించాలి. హైకోర్టు తప్పుబట్టిన అంశాలను కేవలం న్యాయపరమైన ఓటమిగా భావించి ఫైల్ మూసివేయడం సరిపోదు. ప్రక్రియలో లోపాలు ఎందుకు జరిగాయి? వాటికి ఎవరి నిర్లక్ష్యం కారణమైంది? భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఏ చర్యలు తీసుకుంటారు? అన్నది తేలాలి. అధికారుల కుమ్మక్కు జరిగిందని హైకోర్టు నిర్ధారించలేదు. కాబట్టి అలాంటి ఆరోపణలను నిరూపితమైన వాస్తవాలుగా చెప్పలేం. కానీ నిర్లక్ష్యం ఎక్కడ జరిగిందో గుర్తించి పరిపాలనా బాధ్యతను నిర్ణయించడం మాత్రం ప్రభుత్వానికి తప్పనిసరి. తప్పు చేసినా పట్టించుకోని వ్యవస్థగా దేవాదాయశాఖ మిగిలిపోకూడదు. బాధ్యత వహించాల్సిన అధికారులకు జవాబుదారీతనం ఉండాలి.

బ్రహ్మంగారి తత్వాలకంటే పదవే ముఖ్యమైందా?

బ్రహ్మంగారి మఠం అంటే కేవలం ఒక పరిపాలనా వ్యవస్థ కాదు. కాలజ్ఞాన తత్వబోధనలకు, గురుశిష్య సంప్రదాయానికి ప్రతీక. అలాంటి మఠానికి పీఠాధిపతిని ఎంపిక చేసే సమయంలో ఆధ్యాత్మిక పరిజ్ఞానమే ప్రధానంగా ఉండాలి. మఠ ఆస్తులు, పరిపాలనా వ్యవహారాలు చూసుకోవడం మాత్రమే బాధ్యత కాదు. బ్రహ్మంగారి తత్వాలను అర్థం చేసుకోవాలి. వాటిని శిష్యులకు బోధించాలి. సంప్రదాయాన్ని పరిరక్షించాలి. భవిష్యత్తు తరాలకు ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించాలి. ఈ బాధ్యతను నిర్వర్తించే సామర్థ్యం అభ్యర్థిలో ఉందా లేదా అన్నది పరిశీలించాలి. హైకోర్టు కూడా సెక్షన్ 53(2)లో పేర్కొన్న అర్హతలను ప్రస్తావించింది. మతం, తత్వశాస్త్రం, సంబంధిత సంప్రదాయ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖుల అభిప్రాయాలను తీసుకునేందుకు కమిషనర్‌కు అవకాశం కల్పించింది. అంటే ఎంపిక ప్రక్రియలో ఆధ్యాత్మిక అర్హతలకు ఉన్న ప్రాధాన్యాన్ని న్యాయస్థానం స్పష్టం చేసింది. కానీ ఈ అంశాలన్నీ ముందుగానే పరిశీలించాల్సిన బాధ్యత దేవాదాయశాఖదే. పదవి కోసం కుటుంబ సభ్యుల మధ్య పోటీ జరుగుతున్నప్పుడు అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రతి అభ్యర్థి అర్హతను ఒకే ప్రమాణంతో పరిశీలించాలి. వ్యక్తిగత పరిచయాలు, కుటుంబ హోదాలు, బయటి ఒత్తిళ్లు నిర్ణయాన్ని ప్రభావితం చేయకూడదు. బ్రహ్మంగారి తత్వబోధనకు వారసుడిని గుర్తించే ప్రక్రియలో తత్వాలకే ప్రాధాన్యం ఉండాలి. పదవికి కాదు. ఈ మౌలిక సూత్రాన్ని అధికారులు విస్మరించకూడదు.

పెద్ద కుమారుడనే వాదనకు చట్టమే సమాధానం చెప్పింది!

పెద్ద కుమారుడనే కారణంతో పీఠాధిపతి పదవి దక్కుతుందనే వాదనకు కూడా హైకోర్టు స్పష్టమైన చట్టపరమైన వివరణ ఇచ్చింది. కుటుంబ సంప్రదాయం ఏదైనా కావచ్చు. కానీ చట్టం నిర్దేశించిన విధానాన్ని తప్పనిసరిగా పాటించాలి. పెద్ద కుమారుడికి మాత్రమే పీఠాధిపత్యం దక్కాలనే నిబంధన లేదని న్యాయస్థానం పేర్కొంది. మఠాధిపతి కావాలంటే హిందూ మతం, తత్వశాస్త్రంపై ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. సంబంధిత శాస్త్రాలు, సంప్రదాయాలపై అవగాహన ఉండాలి. మఠ సిద్ధాంతాలను శిష్యులకు బోధించే సామర్థ్యం ఉండాలి. ధార్మిక క్రమశిక్షణ, ఆధ్యాత్మిక నిబద్ధత, నైతిక ప్రవర్తన ఉండాలి. ఇవన్నీ సెక్షన్ 53(2)లో పేర్కొన్న అర్హతలు. ఈ నిబంధనలన్నీ అధికారులకు తెలియని విషయాలా? తెలిసి ఉంటే ఎంపిక ప్రక్రియలో వాటికి ఎందుకు ప్రాధాన్యం ఇవ్వలేదు? కుటుంబ వారసత్వ వాదనల మధ్య ఆధ్యాత్మిక అర్హతల పరిశీలన ఎందుకు వెనుకబడింది? పీఠాధిపతి నియామకం కుటుంబ ఆస్తి పంపకం కాదు. మఠం ఒకరి వ్యక్తిగత ఆధీనంలోకి వెళ్లే పదవి కాదు. అది ధార్మిక బాధ్యత. ఈ విషయాన్ని అధికారులు మొదటి నుంచే గుర్తించి ఉంటే ఇంతటి న్యాయపోరాటం అవసరమయ్యేది కాదు. చట్టం స్పష్టంగా ఉన్నప్పుడు దాన్ని పక్కనపెట్టి తీసుకున్న నిర్ణయం చివరకు న్యాయస్థానంలో నిలబడలేకపోయింది. ఇది అధికార యంత్రాంగం గుర్తుంచుకోవాల్సిన గట్టి పాఠం. కుటుంబంలో పెద్దవారనే కారణం ఒక్కటే సరిపోదు. మఠ సంప్రదాయాలపై అవగాహన, ఆధ్యాత్మిక పరిజ్ఞానం, శిష్యులకు మార్గదర్శనం చేసే సామర్థ్యం కూడా తప్పనిసరి.

ధృతరాష్ట్ర పాలనకు స్వస్తి పలకాలి!

బ్రహ్మంగారి మఠం వ్యవహారం కేవలం ఒక కుటుంబంలోని వారసత్వ వివాదం కాదు.. ధార్మిక సంస్థల పరిపాలనలో దేవాదాయశాఖ బాధ్యత, పారదర్శకత, అధికారుల జవాబుదారీతనానికి నిలువుటద్దం. మఠానికి సంబంధించిన ఆస్తులు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు, శిష్యుల విశ్వాసం, పీఠాధిపత్య పరంపర పరస్పరం ముడిపడి ఉన్నందున ఇలాంటి సంస్థలో నియామకాలు అత్యంత జాగ్రత్తగా, చట్టబద్ధంగా జరగాలి. కానీ బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి నియామక ప్రక్రియలో కనీస నోటీసులు కూడా సక్రమంగా జారీ చేయలేదని, ఇతర మఠాల పీఠాధిపతుల భాగస్వామ్యం కల్పించలేదని, శిష్యులకు తమ వాదనలు వినిపించే అవకాశం ఇవ్వలేదని హైకోర్టు తప్పులు ఎత్తిచూపడం దేవాదాయశాఖ పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ లోపాలకు బాధ్యత వహించాల్సిన అధికారులు సమగ్ర వివరణ ఇవ్వాలి. తప్పులు జరిగితే అంగీకరించి సరిదిద్దుకోవడం పరిపాలనా బాధ్యత. వాటిని కప్పిపుచ్చడం, బాధ్యతను ఒకరి నుంచి మరొకరికి నెట్టడం ప్రజల్లో వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని మరింత దెబ్బతీస్తుంది. దేవాదాయశాఖ ఇకనైనా ధృతరాష్ట్ర పాలనకు స్వస్తి పలికి, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలి. శిష్యుల హక్కులను కాపాడుతూ అర్హతలు, సంప్రదాయాలు, నిబంధనల ఆధారంగా పీఠాధిపతి నియామకాన్ని పారదర్శకంగా చేపట్టాలి. గతంలో జరిగిన తప్పిదాలపై సమీక్ష నిర్వహించి, అధికారుల నిర్లక్ష్యం ఎక్కడ జరిగిందో గుర్తించి బాధ్యత నిర్ణయించాలి. ఒకే తరహా అర్జీలపై వచ్చిన ఆరోపణల నిజానిజాలను నిగ్గుతేల్చాలి. బ్రహ్మంగారి మఠానికి తదుపరి పీఠాధిపతి ఎవరన్నది వ్యక్తిగత పలుకుబడితోనో, అధికారుల ఏకపక్ష నిర్ణయంతోనో కాకుండా చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారానే తేలాలి. కుటుంబాల మధ్య వివాదాన్ని పరిష్కరించాల్సిన వ్యవస్థ తన నిర్లక్ష్యంతో మరో వివాదానికి కారణం కాకూడదు. హైకోర్టు తప్పులు ఎత్తిచూపిన తర్వాతైనా దేవాదాయశాఖ కళ్లు తెరిచి బాధ్యతగా వ్యవహరించాలి. మఠం ప్రతిష్ఠను, భక్తుల విశ్వాసాన్ని కాపాడాలి. బ్రహ్మంగారి మఠానికి న్యాయం జరగాలంటే ముందుగా దేవాదాయశాఖ తన నిర్లక్ష్యానికి సమాధానం చెప్పాలి!




హైకోర్టు ఉత్తర్వులతో నియామకం రద్దు.. అధికారులకు గట్టి ఎదురుదెబ్బ!

2026 జనవరి 13న ధార్మిక పరిషత్ జారీ చేసిన తాత్కాలిక పీఠాధిపతి నియామక ఉత్తర్వులను నవంబర్ 4న హైకోర్టు రద్దు చేసింది. చట్టం, మఠాల పరిపాలన నియమావళి నిర్దేశించిన విధానాన్ని పాటించలేదని స్పష్టం చేసింది. కొత్తగా చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి నియామకం చేపట్టాలని దేవాదాయశాఖ కమిషనర్‌ను ఆదేశించింది. వీలైనంత త్వరగా, కోర్టు ఉత్తర్వుల ప్రతిని అందుకున్న తేదీ నుంచి మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని సూచించింది. అదే సమయంలో కొత్త నిర్ణయం వెలువడే వరకు వెంకటాద్రిస్వామి తాత్కాలిక మఠాధిపతిగా కొనసాగాలని ఆదేశించింది. ఈ తీర్పు ఎవరికీ పీఠాధిపత్యాన్ని కట్టబెట్టలేదు. వీరభద్రస్వామి వాదనను ఖరారు చేయలేదు. గోవిందస్వామి వాదనను కూడా తేల్చలేదు. చట్టబద్ధమైన ఎంపిక జరగాలని మాత్రమే స్పష్టం చేసింది. అయితే ఈ తీర్పుతో దేవాదాయశాఖకు వచ్చిన బాధ్యత మరింత పెరిగింది. గతంలో జరిగిన లోపాలను సరిదిద్దడం మాత్రమే కాదు. కొత్త ప్రక్రియపై ఎవరికీ అనుమానం రాకుండా చూడాలి. ఈసారి కూడా నోటీసుల విషయంలో నిర్లక్ష్యం జరిగినా, శిష్యుల గుర్తింపులో పారదర్శకత లేకపోయినా, అర్హతల పరిశీలనలో పక్షపాతం కనిపించినా మరో న్యాయపోరాటానికి దారితీస్తుంది. అప్పుడు బాధ్యత మళ్లీ ప్రభుత్వానిదే అవుతుంది. న్యాయస్థానం తప్పుబట్టిన ప్రక్రియను సరిచేయకుండా మళ్లీ అదే తప్పులు చేస్తే అది నిర్లక్ష్యం మాత్రమే కాదు. న్యాయస్థానం ఇచ్చిన మార్గదర్శకాలను కూడా తేలికగా తీసుకున్నట్లవుతుంది.





మూడు దశాబ్దాల కష్టం.. అద్భుతమైన సాంకేతిక ఆవిష్కరణలు.. లక్షల కోట్ల సామ్రాజ్యం.. ప్రపంచ ఏఐ రంగాన్ని శాసించే స్థాయికి ఎదిగిన ఎన్‌విడియా అధినేత జెన్సన్ హువాంగ్! గేమింగ్ చిప్‌లతో మొదలైన ఆయన ప్రయాణం ప్రపంచ దేశాల భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి చేరింది. కానీ ఇప్పుడు అదే సామ్రాజ్యం చుట్టూ అనూహ్యమైన ప్రకంపనలు! వ్యక్తిగత జీవితంలో కలకలం రేపిన ఓ మహిళ పరిచయం.. భార్యకు నమ్మకద్రోహం చేశానంటూ ఉద్యోగులకు హువాంగ్ క్షమాపణలు.. తెరపైకి వచ్చిన చైనా గూఢచర్య అనుమానాలు.. అమెరికా ఎగుమతి ఆంక్షలను ఉల్లంఘించి వేల కోట్ల విలువైన అత్యాధునిక చిప్‌లు చైనాకు చేరాయన్న ఆరోపణలు.. ఈ వ్యవహారంపై రంగంలోకి దిగిన అమెరికా మాజీ ప్రాసిక్యూటర్ జూన్ కిమ్! మరోవైపు పెట్టుబడిదారుల్లో ఆందోళన.. స్టాక్ మార్కెట్‌లో ఎన్‌విడియా విలువకు భారీ గండి! అసలు ఆలిస్ హువాంగ్ ఎవరు? ఆమెకు జెన్సన్‌తో ఉన్న సంబంధాలేంటి? చైనా నిఘా వ్యవస్థకు ఈ వ్యవహారంతో సంబంధముందా? ప్రపంచాన్ని శాసించిన టెక్ దిగ్గజం ఇప్పుడు ఎందుకు సంక్షోభంలో చిక్కుకున్నారు? వ్యక్తిగత బంధాల వెనుక అంతర్జాతీయ రాజకీయాలున్నాయా? ఒక వ్యక్తి వివాదం.. ప్రపంచ సాంకేతిక సామ్రాజ్యానికే సవాలుగా మారిందా? తెరవెనుక అసలు కథ ఏంటి..!?



స్పై వల.. ఏఐ విలవిల

హనీ ట్రాప్‌లో చిక్కుకున్న ఏఐ దిగ్గజం
నిన్నటి వరకు ప్రపంచ మార్కెట్ అధిపతి

బలహీనతకు లోనవ్వడంతో అధోగతి

గూఢచర్యంతో కూలిన గ్లోబల్ సామ్రాజ్యం

ప్రపంచ సాంకేతిక రంగాన్ని తన చిప్‌లతో శాసిస్తున్న వ్యక్తి జెన్సన్ హువాంగ్. కృత్రిమ మేధ (ఏఐ) విప్లవానికి అవసరమైన అత్యంత కీలకమైన సాంకేతికతను అందిస్తున్న ఎన్‌విడియా సంస్థను స్థాపించి, దానిని ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీల్లో ఒకటిగా నిలబెట్టిన నాయకుడు. ఒకప్పుడు కంప్యూటర్ గేమింగ్ రంగానికే పరిమితమైన గ్రాఫిక్స్ చిప్‌ల వ్యాపారాన్ని ఆయన ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే స్థాయికి తీసుకెళ్లారు. ఏఐ మోడళ్ల శిక్షణ, డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లు, రోబోటిక్స్, స్వయంచాలక వాహనాలు.. ఇలా ఆధునిక సాంకేతిక ప్రపంచంలో దాదాపు ప్రతి కీలక రంగానికి ఎన్‌విడియా చిప్‌లు అవసరమయ్యాయి. అమెరికా, చైనా వంటి అగ్రరాజ్యాల మధ్య సాంకేతిక ఆధిపత్య పోరులో కూడా హువాంగ్ కీలక వ్యక్తిగా మారారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆయనకు ఉన్న సంబంధాలు, అమెరికా ఏఐ ఆధిపత్యాన్ని కాపాడటంలో ఎన్‌విడియా ప్రాధాన్యం ఆయన స్థాయిని మరింత పెంచాయి. అయితే ఇంతటి విజయవంతమైన వ్యక్తి ఇప్పుడు తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివాదంతో అంతర్జాతీయ వార్తల్లో నిలిచారు. చైనా వ్యాపారవేత్తగా ప్రచారం జరుగుతున్న ఆలిస్ హువాంగ్‌తో ఆయనకు సంబంధం ఉందన్న వార్తలు సంచలనం సృష్టించాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే జెన్సన్ హువాంగ్ చైనా వ్యాపారవేత్త కాదు. ఆయన తైవాన్‌లో జన్మించి అమెరికాలో స్థిరపడిన వ్యాపారవేత్త. ఎన్‌విడియా కూడా చైనా కంపెనీ కాదు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రధాన కార్యాలయం కలిగిన సంస్థ. వ్యక్తిగత సంబంధాల ఆరోపణలతో మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు అంతర్జాతీయ గూఢచర్యం, జాతీయ భద్రత, చిప్‌ల అక్రమ రవాణా, అమెరికా–చైనా సంబంధాల వరకు విస్తరించింది. ప్రపంచానికి ఆదర్శంగా కనిపించిన ఒక వ్యాపార దిగ్గజం వ్యక్తిగత నిర్ణయాల కారణంగా ఇంతటి సంక్షోభంలో ఎలా చిక్కుకున్నారన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

మూడు దశాబ్దాల ప్రస్థానం..
ఎన్‌విడియా సామ్రాజ్యం ఎలా నిర్మితమైంది?

1993లో జెన్సన్ హువాంగ్ తన సహచరులు క్రిస్ మలాచోస్కీ, కర్టిస్ ప్రీమ్‌తో కలిసి ఎన్‌విడియాను స్థాపించారు. కంప్యూటర్లలో త్రీడీ గ్రాఫిక్స్‌ను మరింత వేగంగా, నాణ్యంగా ప్రదర్శించే చిప్‌లను తయారు చేయాలన్న ఆలోచనతో ఈ ప్రయాణం మొదలైంది. ఆ సమయంలో కంప్యూటర్ గేమింగ్ పరిశ్రమ అభివృద్ధి చెందుతున్నప్పటికీ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్‌లో అనేక సాంకేతిక పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించేందుకు ప్రత్యేకమైన గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ) సాంకేతికతను అభివృద్ధి చేయడంపై సంస్థ దృష్టి పెట్టింది. 1999లో జీఫోర్స్ 256ను పరిచయం చేయడం ఎన్‌విడియా చరిత్రలో కీలక మలుపుగా నిలిచింది. అనంతరం గేమింగ్ మార్కెట్‌లో తన స్థానాన్ని బలోపేతం చేసుకున్న సంస్థ, 2006లో కుడా సాంకేతికతను ప్రవేశపెట్టి కంప్యూటింగ్ రంగంలో కొత్త మార్గాన్ని తెరిచింది. జీపీయూలను కేవలం గ్రాఫిక్స్ కోసం కాకుండా శాస్త్రీయ పరిశోధనలు, భారీ డేటా విశ్లేషణ, కృత్రిమ మేధ అభివృద్ధి వంటి పనులకు ఉపయోగించే అవకాశాలను అందించింది. ఈ నిర్ణయం భవిష్యత్తులో ఎన్‌విడియాను ఏఐ ప్రపంచానికి కేంద్రంగా మార్చింది. 2022 తర్వాత జనరేటివ్ ఏఐ విపరీతంగా విస్తరించడంతో కంపెనీ చిప్‌లకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా టెక్ సంస్థలు తమ ఏఐ మోడళ్లను అభివృద్ధి చేయడానికి ఎన్‌విడియా జీపీయూలను కొనుగోలు చేయడం ప్రారంభించాయి. డేటా సెంటర్ల నిర్మాణం పెరిగింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టాయి. ఫలితంగా ఎన్‌విడియా మార్కెట్ విలువ లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరింది. ఒకప్పుడు గేమింగ్ చిప్‌ల తయారీ సంస్థగా ప్రారంభమైన కంపెనీ ప్రపంచ ఏఐ పరిశ్రమకు వెన్నెముకగా మారింది. ఈ విజయానికి హువాంగ్ దూరదృష్టి, సాంకేతిక పరిజ్ఞానం, దీర్ఘకాలిక వ్యూహాలే ప్రధాన కారణాలు.

ఆలిస్ హువాంగ్ ఎవరు..
పరిచయం నుంచి వివాదం వరకు!

ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారిన పేరు ఆలిస్ హువాంగ్. ఆమెను హువాంగ్ లే అనే పేరుతో కూడా గుర్తిస్తున్నారు. చైనాకు చెందిన ఈ మహిళ గతంలో మీడియా, ఆర్థిక రంగాల్లో పనిచేసినట్లు కొన్ని అంతర్జాతీయ కథనాలు పేర్కొన్నాయి. హునాన్ టీవీ, చైనా సెంట్రల్ టెలివిజన్ (సీసీటీవీ), హెచ్‌ఎస్‌బీసీ ప్రైవేట్ బ్యాంకింగ్ విభాగం, సిటిక్ సెక్యూరిటీస్ వంటి సంస్థలతో ఆమెకు గతంలో సంబంధాలు ఉన్నట్లు కొన్ని ప్రొఫైల్స్‌లో వివరాలు కనిపించాయి. అయితే ఆమె విద్యార్హతలు, ఉద్యోగ చరిత్రకు సంబంధించిన అన్ని వివరాలు స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. 2023లో సింగపూర్‌కు చెందిన మెగాస్పీడ్ ఇంటర్నేషనల్ సంస్థతో ఆమెకు సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ సంస్థ ఎన్‌విడియా చిప్‌లను కొనుగోలు చేసి ఏఐ కంప్యూటింగ్ సేవలు అందించే వ్యాపారంలో ఉంది. ఎన్‌విడియా చిప్‌ల కొనుగోలులో మెగాస్పీడ్ కీలక కస్టమర్‌గా ఎదిగింది. ఈ క్రమంలో జెన్సన్ హువాంగ్‌తో ఆలిస్‌కు సన్నిహిత పరిచయం ఏర్పడినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇద్దరూ పలు సాంకేతిక కార్యక్రమాల్లో, వ్యాపార సమావేశాల్లో కలిసి కనిపించినట్లు ఫొటోలు, వీడియోలు వెలుగులోకి వచ్చాయి. 2025లో తైవాన్‌లో జరిగిన ఒక విందులో వీరిద్దరూ కలిసి కనిపించడం కూడా చర్చకు దారితీసింది. అయితే ఈ పరిచయం కేవలం వ్యాపార సంబంధమా, వ్యక్తిగత సంబంధంగా మారిందా అన్న ప్రశ్నలు తలెత్తాయి. చివరకు నవంబర్ 8న జెన్సన్ హువాంగ్ తన సంస్థ ఉద్యోగులకు పంపిన సందేశంలో భార్యకు నమ్మకద్రోహం చేసినట్లు అంగీకరించారు. తన చర్యల వల్ల భార్య, పిల్లలు బాధపడ్డారని, అందుకు క్షమాపణలు చెబుతున్నానని వెల్లడించారు. అయితే ఆలిస్ పేరును ఆయన నేరుగా ప్రస్తావించలేదు. ఈ సంబంధం ఎంతకాలం కొనసాగింది? దాని వెనుక వ్యాపార ప్రయోజనాలున్నాయా? వ్యక్తిగత పరిచయాన్ని చైనా నిఘా వ్యవస్థ ఉపయోగించుకుందా? అన్న ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానాలు లేవు. ఆలిస్ హువాంగ్‌పై వచ్చిన గూఢచర్య ఆరోపణలు కూడా ఇంకా నిర్ధారణ కాలేదు.

ప్రేమ వ్యవహారం వెనుక గూఢచర్యం..
చైనా వ్యూహమేంటి?

ఈ వివాదం వ్యక్తిగత సంబంధాలకే పరిమితం కాలేదు. అమెరికా నిఘా వర్గాలు ఆలిస్ హువాంగ్ చైనా ప్రభుత్వ నిఘా వ్యవస్థతో సంబంధాలు కలిగి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు అంతర్జాతీయ పత్రికలు కథనాలు ప్రచురించాయి. ముఖ్యంగా చైనా మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీతో ఆమెకు సంబంధాలున్నాయని, జెన్సన్ హువాంగ్‌తో ఏర్పడిన సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకుని ఎన్‌విడియా వ్యాపార నిర్ణయాలు, చిప్‌ల సరఫరా, అమెరికా ప్రభుత్వ విధానాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునే ప్రయత్నం జరిగి ఉండవచ్చని అమెరికా అధికారుల అంచనాలుగా వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి ఆధారాలు బహిరంగంగా వెల్లడికాలేదు. ఆలిస్ చైనా కోసం గూఢచర్యం చేశారనే విషయం ఇప్పటివరకు న్యాయస్థానంలో నిరూపితం కాలేదు. మరోవైపు ఎన్‌విడియా చిప్‌లకు చైనాలో భారీ డిమాండ్ ఉంది. ఏఐ రంగంలో అమెరికాతో పోటీ పడాలంటే అత్యాధునిక జీపీయూలు అవసరం. కానీ చైనా సైనిక, వ్యూహాత్మక సామర్థ్యాలను పెంచే అవకాశం ఉందన్న కారణంతో అమెరికా ప్రభుత్వం అత్యాధునిక చిప్‌ల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షల మధ్య కొన్ని సంస్థలు ఇతర దేశాల్లోని వ్యాపార మార్గాల ద్వారా చిప్‌లను కొనుగోలు చేసి చైనాకు తరలించాయన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. మెగాస్పీడ్ సంస్థ కూడా ఈ వ్యవహారంలో పరిశీలనకు వచ్చింది. ఈ సంస్థ ద్వారా చైనా కంపెనీలకు పరిమితులు ఉన్న చిప్‌లు చేరాయా అన్నది అమెరికా అధికారుల దర్యాప్తులో కీలక అంశంగా మారింది. ఆలిస్ హువాంగ్ వ్యక్తిగత పరిచయాలను ఉపయోగించి ఎన్‌విడియా వ్యాపార సంబంధాల ద్వారా చిప్‌ల సరఫరాను సులభతరం చేశారన్న ఆరోపణలు కూడా వెలువడ్డాయి. మరోవైపు చైనా ప్రభుత్వం ఈ గూఢచర్య ఆరోపణలను ఖండించింది. తమ దేశంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించింది. కాబట్టి ఇక్కడ రెండు అంశాలను వేరు చేసి చూడాలి. చిప్‌ల సరఫరాపై జరుగుతున్న దర్యాప్తు ఒకటి. వ్యక్తిగత సంబంధాల వెనుక చైనా నిఘా వ్యవస్థ ఉందన్న అనుమానం మరొకటి. ఈ రెండింటి మధ్య సంబంధం ఉందా లేదా అన్నది ఇంకా తేలాల్సి ఉంది.

రూ.7.5 లక్షల కోట్ల విడాకులా.. అసలు డబ్బుల లెక్క ఇదే!

ఈ వివాదంలో మరో భారీ సంఖ్య అంతర్జాతీయంగా చర్చకు వచ్చింది. అదే 7.5 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.60 వేల కోట్లకు పైగా ఉంటుంది. కొన్ని వార్తల్లో కనిపిస్తున్న ఈ మొత్తాన్ని విడాకుల పరిహారంగా భావించడం తప్పు. వాస్తవానికి ఇది చైనాకు తరలించబడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్‌విడియా చిప్‌ల సరఫరా విలువకు సంబంధించిన సంఖ్య. రాయిటర్స్ నవంబర్ 10న ప్రచురించిన కథనం ప్రకారం, ఆలిస్ హువాంగ్‌తో సంబంధాలున్న వ్యాపార నెట్‌వర్క్ ద్వారా కనీసం 7.5 బిలియన్ డాలర్ల విలువైన చిప్‌లు చైనా సంస్థలకు చేరినట్లు ది ఇన్ఫర్మేషన్ నివేదించింది. ఈ నెట్‌వర్క్‌లో ఆలిస్‌తో పాటు ఆమె భర్త, సోదరి కూడా ఉన్నారని ఆ కథనం పేర్కొంది. షాంఘై సెంచరీ లిటాంగ్ అనే చైనా సంస్థకు ఈ వ్యవహారంలో ప్రాధాన్యం ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. అమెరికా ఎగుమతి ఆంక్షలకు లోబడి ఉన్న హెచ్ 100, హెచ్200, కొన్ని ఏ100 చిప్‌లు కూడా ఈ సరఫరాలో ఉన్నా యని ఆరోపణలు వచ్చాయి. మొత్తం సుమారు 2.4 లక్షల చిప్‌లు చైనాకు చేరినట్లు నివేదికలో పేర్కొన్నారు. అయితే ఈ వివరాలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. మరోవైపు జెన్సన్ హువాంగ్ భార్య లోరీతో 1985 నుంచి వివాహ బంధంలో ఉన్నారు. ఆయన చేసిన వ్యక్తిగత తప్పిదాన్ని అంగీకరిస్తూ క్షమాపణలు చెప్పినప్పటికీ, భార్య విడాకులు కోరారా? ఎంత పరిహారం అడిగారు? రూ.7.5 లక్షల కోట్ల ఆస్తుల బదిలీ జరగనుందా? వంటి అంశాలకు సంబంధించి విశ్వసనీయమైన అధికారిక సమాచారం లేదు. ఇదిలా ఉంటే ఎన్‌విడియా బోర్డు ఈ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించింది. అమెరికా ఫెడరల్ అధికారులు కూడా సంబంధిత అంశా లను పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. కంపెనీ రహస్యాలు బయటకు వెళ్లాయా? జెన్సన్ హువాంగ్‌కు చిప్‌ల సరఫరాపై ఉన్న ఆరోపణల గురించి ముందే తెలుసా? ఆయన వ్యక్తిగత సంబంధాలను వ్యాపార ప్రయోజనాల కోసం ఉపయోగించారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు దర్యాప్తు పూర్తయ్యాకే తెలుస్తాయి.

కిమ్ ఎంట్రీ.. అమెరికా ఒత్తిడి..
కుప్పకూలుతున్న మార్కెట్ విలువ!

ఈ వ్యవహారంలో కిమ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. అయితే ఆయన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ కాదు. ఎన్‌విడియా బోర్డు నియమించిన దర్యాప్తు బృందానికి నాయకత్వం వహించనున్న అమెరికా మాజీ ఫెడరల్ ప్రాసిక్యూటర్ జూన్ హెచ్. కిమ్. ప్రముఖ న్యాయ సంస్థ వాచ్టెల్, లిప్టన్, రోసెన్ అండ్ కాట్జ్‌కు చెందిన భాగస్వామిగా ఉన్న ఆయనకు గతంలో అమెరికా న్యాయశాఖలో కీలక కేసులను విచారించిన అనుభవం ఉంది. ఎన్‌విడియా వ్యవహారంలో ఆయన నియామకం దర్యాప్తు తీవ్రతను తెలియజేస్తోంది. మరోవైపు అమెరికా రాజకీయ వర్గాల్లో కూడా ఈ వివాదం ప్రకంపనలు సృష్టిస్తోంది. ట్రంప్ ప్రభుత్వం ఏఐ రంగంలో చైనా కంటే అమెరికా ముందుండాలని భావిస్తోంది. ఎన్‌విడియా చిప్‌లు అమెరికా సాంకేతిక ఆధిపత్యానికి అత్యంత కీలకం. అదే సమయంలో చైనాకు చిప్‌ల అమ్మకాలను అనుమతించాలా వద్దా అన్న అంశంపై అమెరికాలో రాజకీయ విభేదాలున్నాయి. హువాంగ్ గతంలో చైనా మార్కెట్‌కు చిప్‌ల సరఫరాను కొనసాగించాలని వాదించారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యక్తిగత సంబంధాలపై వచ్చిన ఆరోపణలు అమెరికా జాతీయ భద్రతా చర్చను మరింత తీవ్రం చేశాయి. కంపెనీపై పెట్టుబడిదారులు కూడా దావా వేశారు. కీలక సమాచారాన్ని దాచిపెట్టడం వల్ల వాటాదారులకు నష్టం జరిగిందని వారు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో నవంబర్ 9న ఎన్‌విడియా షేర్లు 4.3 శాతం పడిపోయి సుమారు 190 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను కోల్పోయాయి. అనంతరం రెండు ట్రేడింగ్ సెషన్లలో కలిపి కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 430 బిలియన్ డాలర్ల మేర తగ్గుదల నమోదైనట్లు వార్తలు వచ్చాయి. అయితే కంపెనీ వ్యాపార పునాదులు కూలిపోయాయని దీనర్థం కాదు. పెట్టుబడిదారుల్లో పెరిగిన అనిశ్చితి, నాయకత్వంపై ప్రశ్నలు, చట్టపరమైన ప్రమాదాలు, చైనా మార్కెట్‌పై ప్రభావం వంటి అంశాలు షేర్లపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఎన్‌విడియా మాత్రం కంపెనీ రహస్యాలు లేదా అమెరికా జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారం బయటకు వెళ్లిందని నమ్మడానికి తమ వద్ద ఆధారాలు లేవని ప్రకటించింది. చైనా కూడా గూఢచర్య ఆరోపణలను తిరస్కరిస్తోంది. ఇప్పుడు ప్రపంచం ఎదురుచూస్తున్నది దర్యాప్తు ఫలితాల కోసం. ఆలిస్ హువాంగ్ పాత్ర ఏమిటి? మెగాస్పీడ్ ద్వారా చిప్‌ల అక్రమ తరలింపు జరిగిందా? జెన్సన్ హువాంగ్‌కు ఈ వ్యవహారంపై ఎంతవరకు అవగాహన ఉంది? ఎన్‌విడియా నాయకత్వంపై ఈ వివాదం ఎలాంటి ప్రభావం చూపుతుంది? అన్న ప్రశ్నలకు సమాధానాలు తేలాల్సి ఉంది. మూడు దశాబ్దాల కష్టంతో నిర్మించిన సాంకేతిక సామ్రాజ్యానికి వ్యక్తిగత వివాదం, అంతర్జాతీయ రాజకీయాలు, గూఢచర్య అనుమానాలు ఒకేసారి సవాలుగా మారాయి. ఈ సంక్షోభం నుంచి జెన్సన్ హువాంగ్ బయటపడతారా? లేక ప్రపంచ ఏఐ సామ్రాజ్యంపై ఈ వివాదం శాశ్వత ముద్ర వేస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.







ఐపీఎల్‌లో మెగా ట్రేడ్

హార్దిక్ అటు.. అర్ష్‌దీప్ ఇటు!
ముంబైకి పేస్ పవర్
పంజాబ్‌కు ఆల్‌రౌండర్ !

ఐపీఎల్ -2027కు ముందే ఫ్రాంచైజీల మధ్య ట్రాన్స్‌ఫర్ సంచలనం మొదలైంది. ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన భారీ ట్రేడ్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్‌కు వెళ్లగా, పంజాబ్ పేస్ గుర్రం అర్ష్‌దీప్ సింగ్ ముంబై గూటికి చేరాడు. ఈ మార్పుతో రెండు జట్ల బలాబలాలు ఒక్కసారిగా మారిపోయాయి. రూ.18 కోట్ల పారితోషికంతో హార్దిక్ పంజాబ్ తరఫున బరిలోకి దిగనుండగా, అర్ష్‌దీప్ తన ప్రస్తుత రూ.18 కోట్ల ధరతోనే ముంబై జట్టులో చేరనున్నాడు. 2015లో ముంబైతో ఐపీఎల్ ప్రయాణం ప్రారంభించిన హార్దిక్, గుజరాత్ టైటాన్స్‌కు నాయకత్వం వహించి తిరిగి ముంబై కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ విజయంలో భాగమైన అతడు ఇప్పుడు మూడో జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. మరోవైపు 2019 నుంచి పంజాబ్‌కు ఆడుతున్న అర్ష్‌దీప్ 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు తీసి ఆ జట్టు తరఫున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. ఇప్పుడు బుమ్రాతో కలిసి ముంబై బౌలింగ్‌ను మరింత పదునెక్కించనున్నాడు. హార్దిక్ నిష్క్రమణతో ముంబై కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంది. మెరుపులు మెరిపించాలని చూస్తున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌లో అవకాశాల కోసం అభిషేక్ పోరెల్, పృథ్వీ షా పోటీపడుతున్నారు. ముంబైలో దీపక్ చాహర్‌కు నిలకడ అవసరం కాగా, లక్నో నుంచి బదిలీపై ఊహాగానాలు ఎదుర్కొంటున్న షమీకి ఈ టోర్నీ కీలకం. గాయం నుంచి కోలుకుంటున్న శార్దూల్ ఠాకూర్ కూడా పునరాగమనంపై కన్నేశాడు. ఆర్సీబీలో తన స్థానం నిలబెట్టుకోవాలంటే యశ్ దయాల్ సత్తా చాటాల్సిందే. ఢిల్లీ జట్టులో కుల్దీప్ రాకతో దిగ్వేశ్ రాఠీకి పోటీ పెరిగింది. చెన్నై తరఫున ఆశించిన ప్రభావం చూపలేకపోయిన ప్రశాంత్ వీర్ బ్యాట్, బంతితో సమాధానం చెప్పాల్సి ఉంది. పంజాబ్ జట్టులో హార్దిక్ రాకతో శశాంక్ సింగ్‌కూ సవాల్ ఎదురైంది. మొత్తానికి ఇది కేవలం దేశవాళీ టోర్నీ కాదు.. ఐపీఎల్ భవిష్యత్తును నిర్ణయించే వేదికగా మారనుంది!

రూ.43 కోట్లకు కోత

కేకేఆర్‌కు ఆకాశ్ చోప్రా షాక్!



- గ్రీన్, పతిరణను వదిలించుకోండి
- వేలానికి నిధులు సిద్ధం చేసుకోండి!

ఐపీఎల్ -2027కు ముందే కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా గట్టి సలహా ఇచ్చాడు. జట్టు ప్రక్షాళనకు సిద్ధం కావాలని, భారీ ధర పలికిన స్టార్ ఆటగాళ్లను సైతం వదులుకోవాలని సూచించాడు. ముఖ్యంగా ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్, శ్రీలంక పేసర్ మతీష పతిరణలను విడుదల చేసి ఏకంగా రూ.43.20 కోట్లను ఆదా చేసుకోవాలని అభిప్రాయపడ్డాడు. గత వేలంలో గ్రీన్‌ను రూ.25.20 కోట్లకు, పతిరణను రూ.18 కోట్లకు కేకేఆర్ కొనుగోలు చేసింది. అయితే గ్రీన్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పాటు, ఆస్ట్రేలియా అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా వచ్చే సీజన్‌లో అతడి అందుబాటుపై సందేహాలున్నాయి. మరోవైపు గాయాలతో సతమతమైన పతిరణ గత సీజన్‌లో కేకేఆర్ తరఫున కేవలం ఎనిమిది బంతులే వేశాడు. వీరిద్దరినీ కొనసాగించడం కంటే భారీ మొత్తాన్ని వేలం కోసం అందుబాటులో ఉంచడం మంచిదని చోప్రా సూచించాడు. రమణదీప్ సింగ్, రాహుల్ త్రిపాఠి, రచిన్ రవీంద్ర, బ్లెస్సింగ్ ముజరబానీ భవితవ్యాన్ని మాత్రం సందిగ్ధంలో పెట్టాడు. ఫిన్ అలెన్, అంగ్‌క్రిష్ రఘువంశీ, సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి, రింకూ సింగ్, కార్తిక్ త్యాగీలను కొనసాగించాలని అభిప్రాయపడ్డాడు. 2025లో ఎనిమిదో స్థానం, 2026లో ఏడో స్థానంతో నిరాశపరిచిన కేకేఆర్‌కు ఇప్పుడు కొత్త కూర్పు అవసరం. నవంబర్ 17 రిటెన్షన్ గడువు సమీపిస్తుండటంతో జట్టు యాజమాన్యం నిర్ణయాలపై ఉత్కంఠ నెలకొంది. మూడు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా మళ్లీ టైటిల్ వేటలోకి రావాలంటే ఈ వేలం కీలకం కానుంది!

ముస్తాక్ అలీ టోర్నీ

పది మందికి చావోరేవో!
ఐపీఎల్–2027 వేలం పరీక్ష
ఫామ్ కోసం స్టార్ల పోరాటం!

ఐపీఎల్ -2027 వేలానికి సమయం దగ్గరపడుతోంది.. ట్రేడింగ్ విండోలో బదిలీల వేడి పెరుగుతోంది.. ఈ తరుణంలో నవంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ పది మంది క్రికెటర్లకు కీలక పరీక్షగా మారనుంది. సూర్యకుమార్ యాదవ్ నుంచి పృథ్వీ షా వరకు, దీపక్ చాహర్ నుంచి మహ్మద్ షమీ వరకు తమ ఫామ్‌ను నిరూపించుకోవాల్సిన పరిస్థితి! టీ20 ప్రపంచకప్ విజయానంతరం భారత జట్టు ప్రణాళికల్లో చోటు కోల్పోయిన సూర్య, ముంబైకి నాయకత్వం వహిస్తూ మళ్లీ



సీఎస్‌కేకు ఆయుష్ మంత్ర

వదులుకుంటే భారీ నష్టమే!
భవిష్యత్ స్టార్‌ను కాపాడుకోండి!

ఐపీఎల్ -2027 వేలానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్‌కు మాజీ క్రికెటర్ అభినవ్ ముకుంద్ కీలక సూచనలు చేశాడు. యువ సంచలనం ఆయుష్ మాత్రేను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని స్పష్టం చేశాడు. అతడు సీఎస్‌కే భవిష్యత్‌లో కీలక ఆటగాడిగా ఎదుగుతాడని, మూడో స్థానంలోనూ, ఓపెనర్‌గానూ విధ్వంసకరంగా ఆడగలడని ప్రశంసించాడు. ఇటీవల హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న మాత్రే రెండు నుంచి మూడు నెలలు ఆటకు దూరమయ్యే అవకాశం ఉన్నా అతడిపై నమ్మకం తగ్గించుకోవద్దని సూచించాడు. మరోవైపు ఉర్విల్ పటేల్‌ను ట్రేడ్ చేయడంపై సీఎస్‌కే ఆలోచించాలని అభిప్రాయపడ్డాడు. ఇప్పటికే ఆయుష్ మాత్రే, కార్తిక్ శర్మ, డెవాల్డ్ బ్రెవిస్, సర్ఫరాజ్ ఖాన్ వంటి బ్యాటర్లు జట్టులో ఉండటంతో ఉర్విల్‌కు అవకాశాలు తగ్గవచ్చన్నాడు. టాప్ ఆర్డర్‌లో రద్దీ తగ్గించి, ఉర్విల్‌కు మరో జట్టులో ఎక్కువ అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నాడు.





మరోసారి సింగర్‌గా బాలయ్య

'దాదా ధమాకా' సాంగ్ రిలీజ్ ఎప్పుడంటే?

బాలయ్య లేటెస్ట్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'దాదా' నుంచి ఫస్ట్ సింగిల్ ఈ నెల 13న రిలీజ్ కానుంది. స్పెషల్ సాంగ్‌తో బాలయ్య బిగ్ సర్ప్రైజ్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. గాడ్ ఆఫ్ మాసెస్ బాలయ్య, స్టార్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబో అవెయిటెడ్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ దాదా ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజైన గ్లింప్స్ భారీ హైప్ క్రియేట్ చేయగా... ఫస్ట్ సింగిల్ నవంబర్ 13 (శుక్రవారం) రిలీజ్ కానుంది. దీపావళి సందర్భంగా మేకర్స్ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. తాజాగా, ఈ పాట గురించి మరో క్రేజ్ న్యూస్ వైరల్ అవుతోంది. 'దాదా' సినిమా కోసం బాలయ్య మరోసారి సింగర్‌గా మారినట్లు తెలుస్తోంది. 'దాదా ధమాకా' సాంగ్‌ను అయనే స్వయంగా పాడారని సమాచారం. గతంలో 'పైసా వసూల్' సినిమాలో టైటిల్ సాంగ్... 'అరే మామా ఏక్ పెగ్ లా' పాడిన బాలయ్య ఉర్రూతలూగించారు. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్‌కు వాయిస్ అందించడంతో ఫ్యాన్స్‌లో మరింత ఆసక్తి నెలకొంది. ఈ పాట ఈ నెల 13న (శుక్రవారం) రిలీజ్ చేయనున్నారు. ఈ సాంగ్‌లో బాలయ్యతో కలిసి నర్గీస్ ఫక్రీ స్టెప్పులు వేయనున్నారు. తమన్ మ్యూజిక్, బాలయ్య వాయిస్, గ్రేస్, స్టెప్పులతో మాస్ ఆడియన్స్‌ను ఓ ఊపు ఊపేయడం ఖాయంగా కనిపిస్తోంది. గతంలో బాలయ్య, గోపీచంద్ కాంబోలో వచ్చిన 'వీర సింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. వీరిద్దరి కాంబోలో వస్తోన్న రెండో మూవీ దాదాపై అంచనాలు భారీగా ఉన్నాయి. బాలయ్యను మాస్ అవతార్‌లో చూపించారు. ముంబై మాఫియా బ్యాక్ డ్రాప్‌తో పాటు అండర్ వరల్డ్ మాఫియా, గ్యాంగ్ స్టర్ వార్స్, బాంబు పేలుళ్ల నేపథ్యంలో ఈ మూవీ స్టోరీ సాగనున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీలో బాలయ్య సరసన కాజల్ అగర్వాల్ నటిస్తున్నారు. ఆమె ప్రభుత్వ అధికారిణిగా నటిస్తున్నట్లు ఫస్ట్ లుక్‌ను బట్టి తెలుస్తోంది. భగవంత్ కేసరి తర్వాత ఇద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. రాకింగ్ మంచు మనోజ్ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు. తమన్ మ్యూజిక్ అందిస్తుండగా... వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



రోషన్ పాన్ ఇండియా మూవీ

ఇంద్రగంటి దర్శకత్వంలో కొత్త అవతారం!

టాలీవుడ్‌లో మరో సరికొత్త సూపర్‌హీరో ప్రయాణానికి తెరలేచింది! హీరో శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా ఇప్పుడు వెండితెరపై సూపర్‌హీరోగా అవతరించబోతున్నారు. 'పెళ్లి సందడి', 'ఛాంపియన్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన రోషన్, ప్రస్తుతం 'ఏమో ఏమో ఇది' విడుదలకు సిద్ధమవుతుండగానే మరో భారీ ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నారు. విలక్షణ ప్రేమకథలతో తనదైన ముద్ర వేసిన దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి ఈసారి సరికొత్త సూపర్‌హీరో ప్రపంచాన్ని సృష్టించేందుకు సిద్ధమయ్యారు. అశోక్ క్రియేషన్స్ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నంబర్ 3ను నిర్మాతలు అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు బుధవారం సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'కొత్త సూపర్‌హీరో ప్రపంచం ప్రాణం పోసుకుంటోంది.. ప్రపంచం ఓ సరికొత్త సూపర్‌హీరో కోసం ఎదురుచూస్తోంది' అంటూ మేకర్స్ ప్రకటించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శ్రీకాంత్ క్లాప్ కొట్టగా, ముప్పా వెంకయ్య చౌదరి కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్రబృందానికి స్క్రిప్ట్ అందించారు. రోషన్ సరసన రేఖా పాండే, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటించనున్నారు. పీజీ విందా కెమెరా బాధ్యతలు చేపట్టగా, గౌర హరి సంగీతం అందించనున్నారు. అంతర్జాతీయ కొరియోగ్రాఫర్ లీ విటేకర్, రామకృష్ణ ఆధ్వర్యంలో హైఎండ్ యాక్షన్ సన్నివేశాలు తెరకెక్కనున్నాయి. డిసెంబర్‌లో షూటింగ్ ప్రారంభించి, 2027 ద్వితీయార్ధంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పాన్ ఇండియా స్థాయిలో విజువల్ వండర్‌గా రూపొందనున్న ఈ చిత్రం రోషన్ కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా నిలవనుందనే అంచనాలు నెలకొన్నాయి.

మెగాస్టార్ షోలో రెబల్ స్టార్ సందడి!

- మెగావర్స్‌లో ప్రభాస్ ఎంట్రీపై బజ్
- నవంబర్ 20న స్పెషల్ ఎపిసోడ్?

టాలీవుడ్‌లో ఇద్దరు బాక్సాఫీస్ బాహుబలులు ఒకే వేదికపై కనిపిస్తే ఆ సందడే వేరు! మెగాస్టార్ చిరంజీవి తొలిసారిగా ఓటీటీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్న 'మెగావర్స్' ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా తెరకెక్కుతున్న ఈ సెలబ్రిటీ టాక్ షోపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ ప్రత్యేక అతిథిగా సందడి చేయబోతున్నారన్న వార్త అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ క్రేజీ ఎపిసోడ్ నవంబర్ 20, 2026న చిత్రీకరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే నిజమైతే వెండితెరపై తమదైన ముద్ర వేసిన ఇద్దరు అగ్రతారలు ఒకే వేదికపై కలవడం ప్రేక్షకులకు కనులపండువగా మారనుంది. చిరంజీవి చమత్కారాలు, ప్రభాస్ సరదా సంభాషణలు, ఇద్దరి మధ్య ఆసక్తికరమైన ముచ్చట్లు ఎలా ఉండబోతాయోనని అభిమానులు ఇప్పటి నుంచే ఊహల్లో విహరిస్తున్నారు. అయితే ప్రభాస్ పాల్గొనడంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు ఈ షో షూటింగ్ ఇప్పటికే జోరుగా సాగుతోంది. అక్కినేని నాగార్జునతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా తమ ఎపిసోడ్ల చిత్రీకరణను పూర్తి చేసినట్లు సమాచారం. ఇలా ఒక్కో ఎపిసోడ్‌కు స్టార్‌డమ్‌ను జోడిస్తూ 'మెగావర్స్' ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. త్వరలోనే ప్రీమియర్ తేదీని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. బుల్లితెరపై కాదు.. డిజిటల్ తెరపై మెగాస్టార్ సందడి చేయబోతుండటంతో, అందులో ప్రభాస్ కూడా తోడైతే అభిమానులకు అంతకంటే పెద్ద పండగ ఏముంటుంది! మెగాస్టార్-రెబల్ స్టార్ కాంబినేషన్ కోసం సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.